ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

5

సోమవారం 9 సెప్టెంబరు 2024






సత్తెనపల్లిలోని నాగార్జున నగర్‌లో 61 అడుగుల మట్టి వినాయకుడి విగ్రహం



గుంటూరు: నల్లచెరువులో విఘ్నేశ్వర యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణనాథుడు



గుంటూరు: శ్రీనగర్ ఏడవ లైనులో...



చీరాలలోని మహాత్మాగాంధీ క్లాత్ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన శేష పాన్పుపై పవళిస్తున్న గణపయ్య విగ్రహం



తెనాలి: గంగానమ్మపేటలో బంకమట్టితో గడ్డి వినాయకుడు

దండాలయ్యా.. ఉండ్రాలయ్యా

- భక్తిశ్రద్ధలతో చవితి ఉత్సవాలు
- వాడవాడలా కొలువుదీరిన గణనాథులు
- సత్తెనపల్లిలో 61 అడుగుల మట్టి గణపతికి పూజలు

గుంటూరు, నరసరావుపేట, బాపట్ల, సెప్టెంబరు 8: దండాలయ్యా.. ఉండ్రాలయ్యా. జై బోలో.. గణేష్ మహరాజ్‌కూ జై.. గణపతి బప్పా మోరియా, జై గణేశా.. జై జై గణేశా నినాదాలు హోరెత్తగా.. ప్రత్యేకంగా అలంకరించిన మండపాల్లో వివిధ రూపాల్లో గణనాథులు భక్తులకు దర్శనమిచ్చారు. చవితి సందర్భంగా గణనాథులను దర్శించుకుని భక్తులు భక్తిపారవశ్యం లో మునిగితేలారు. జిల్లావ్యాప్తంగా శనివారం ఇంటింటా, వాడ వాడలా చవితి వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. వీధివీధిన ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుని ప్రతిమలు, ఇంటింటా కొలువుదీరిన బొజ్జ గణపయ్య వేడుకలతో జిల్లా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఉదయం నుంచే అన్ని ప్రాంతాల్లో చవితి సందడి నెలకొంది. వినాయక చవితి పర్వదినాన్ని ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. వాడవాడలా విభిన్న రూపాల్లో ప్రతిష్ఠించిన గణనాథులకు ప్రత్యేక పూజలు జరిపారు. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన పందిళ్లలో ఏర్పాటు చేసిన గణనాథులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చవితి రోజున అనేక ప్రాంతాల్లో వివిధ సంఘాల ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా మట్టి గణనాథుల ప్రతిమలను పంపిణీ చేశారు. వీధి వీధినా ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన మండపాలలో భారీ వినాయక విగ్రహాల వద్ద ప్రత్యేక పూజాది క్రతువులను నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన మండపాల్లో ప్రతిష్ఠించిన గణనాథులకు వేద పండితులు మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండపాల వద్ద వేదపఠనం, భక్త బృందాల భజనలతో సందడి నెలకొంది. భక్తులు పెద్ద సంఖ్యలో వేడుకల్లో పాల్గొని మొక్కు లు తీర్చుకున్నారు. కాలనీల్లో, అపార్టుమెంట్లలో, వీధివీధిన ఏర్పాటు చేసిన విగ్రహాలు అకట్టుకున్నాయి. వీటిని తిలకించేందుకు పిల్లలు, పెద్దలు బారులు తీరారు. కొన్ని ప్రాంతాల్లో వర్షం భక్తుల సందర్శనకు ఆటంకంగా మారింది. మరో వైపు ఆలయాల వద్ద చవితి పండుగ శోభ సంతరించుకుంది. స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు బారు లు తీరారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. గణేశ్ మండపాల వద్ద రెండో రోజు ఆదివారం నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండపాల్లో గణనాథులను దర్శించుకునేందుకు వచ్చిన వారికి ప్రత్యేకంగా ప్రసాదాలను పంపిణీ చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఆదివారం పలుచోట్ల గణపతి విగ్రహాలను నిమజ్జనోత్సవానికి తరలించారు.

- సత్తెనపల్లి నాగార్జుననగర్‌లో శ్రీసత్యసాయి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 61 అడుగుల మట్టి వినాయకుడి ప్రతిమకు ప్రత్యేక పూజలు జరిగాయి. పర్యావరణ హితంగా ఏర్పాటు చేసిన ఈ వినాయకుడు భక్తుల నుంచి పూజలు అందుకుంటున్నారు. బంక మట్టి, వెదురు, వరి పొట్టుతో నెల రోజులు కార్మికులు వినూత్నంగా రూపొందించిన మట్టి గణపతి విగ్రహం భక్తులను విశేషంగా ఆకర్షిస్తోంది. వినాయక నిమజ్జనానికి వచ్చే సమయంలో నిర్వాహక కమిటీలు సురక్షితంగా కార్యక్రమాన్ని ముగించుకునేలా పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సతీష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. తెనాలి మండలంలోని సంగంజాగర్లమూడి కొమ్మమూరు కాలువ లాకుల ప్రాంతాన్ని ఎస్పీ పరిశీలించి అధికారులకు ప్రత్యేక సూచనలు చేశారు.
- తెనాలి గంగానమ్మపేటలో గణేష్ మెడికల్ కమిటీ ఆధ్వర్యంలో కోల్‌కతా నుంచి తెప్పించిన బంకమట్టితో పచ్చిగడ్డి మొలిచేలా వినాయకుడి ప్రతిమను ఏర్పాటు చేశారు. దీనిపై రోజూ నీరు చల్లుతూ ఉంటే ఎన్ని రోజులైనా గడ్డి వినాయకుడి లాగానే కనిపిస్తుంది. ఇక పట్టణంలో ఏర్పాటు చేసిన పలు వినాయక విగ్రహాలను దర్శించుకున్న మంత్రి నాదెండ్ల మనోహర్ ఆయా పందిళ్ల వద్ద జరిగిన పూజల్లో పాల్గొన్నారు.
- బాపట్ల ఏఆర్ కార్యాలయంలో పోలీసులు ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమ వద్ద ఎస్పీ తుషార్‌డూడీ దంపతులు పూజలు నిర్వహించారు.

మళ్లీ.. వరద ముప్పు

చెరుకుపల్లి మండలం గూడవల్లి పంచాయతీ పాంచాలవరం రోడ్డులో నీటమునిగిన వేలాది ఎకరాల పంటపొలం



- నాగార్జున సాగర్ నుంచి నీటి విడుదల
- ప్రకాశం బ్యారేజ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక
- ప్రభావిత గ్రామాలను అప్రమత్తం చేస్తున్న అధికారులు
- పునరావాస కేంద్రాలకు రావాలని లంక గ్రామాల్లో దండోరా
- పది రోజులుగా పొలాల్లో తగ్గని నీరు.. నీటిలోనే 13 వేల ఎకరాలు



వరద ముంపు నుంచి బయట పడి కుళ్లిపోయిన పసుపు పైరు



కొల్లూరు: వరద ముంపులోనే పసుపు పైరు



కొల్లూరు: దోనేపూడి వద్ద చప్టాపై ప్రవహిస్తున్న వరద నీరు



అమర్తలూరు మండలంలో పంటపొలాల గట్లపై నుంచి వెళుతున్న నీరు.. మునిగిన పొలాలు

బాపట్ల, రేపల్లె, సెప్టెంబరు 8: కృష్ణమ్మ మళ్లీ కన్నెర్ర చేస్తోంది. భారీ వర్షాలతో ఉధృతంగా ప్రవహించి ఇటీవలే శాంతించింది.. అనుకునేంతలో మళ్లీ వరద పోటెత్తుతోంది. వారం రోజుల క్రితం ఉగ్రరూపం దాల్చిన కృష్ణానది తీర ప్రాంతాలను ముంపునకు గురి చేసింది. నదీ తీర గ్రామాలు, లంకలు ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నాయి. ఇంతలోనే రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో వరద ఉధృతి క్రమేపీ పెరుగుతోంది. దీంతో ఆదివారం శ్రీశైలంతో పాటు నాగార్జున జలాశయం, ప్రకాశం బ్యారేజీల గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశారు. ఈ క్రమంలో దిగువ ప్రాంతాల వారిని అధికారులు అప్రమత్తం చేశారు. నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ 24 క్రస్ట్ గేట్ల ద్వారా ఆదివారం అధికారులు నీటిని విడుదల చేశారు. 20 గేట్లను 5 అడుగులు, 4 గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 2,18,300 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రకాశం బ్యారేజి వద్ద మళ్లీ వరద ఉధృతి పెరుగుతోంది. ఆదివారం సాయంత్రానికి 4 లక్షల 56వేల 602 క్యూసెక్కుల వరద నీరు బ్యారేజి వద్దకు చేరుతున్నట్టు సమాచారం. బ్యారేజికి వరద పెరగడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. దిగువ నది ప్రాంతవాసులు, లంక భూముల రైతులు అందరూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. బ్యారేజీ నుంచి నీటిని దిగువకు విడుదల చేస్తుండటంతో కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లోని లంక గ్రామాలు మళ్లీ వరద గుప్పెట్లో చిక్కుకోనున్నాయి. బాపట్ల కలెక్టర్ వెంకటమురళి ఆదేశాలతో అధికార యంత్రాంగం అప్రమత్తమై వరద హెచ్చరికలు జారీ చేసింది. కొల్లూరు మండల పరిధిలోని లంక గ్రామాల్లో జేసీ ప్రఖర్‌జైన్, ఆర్డీవో హేలాషారోన్‌లతో కలిసి కలెక్టర్ జె.వెంకటమురళి పర్యటించారు. అరవింద వారధి వద్ద ప్రవాహాన్ని పరిశీలించారు. కొల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. నదికి వరద ప్రవాహం 5.5 లక్షల క్యూసెక్కులతో చేరుకోవడంతో 2వ ప్రమాద హెచ్చరికను జారీ చేసినట్లు ప్రకటించారు. అధికారులంతా గత వారంలో చేసిన విధంగానే యథావిధిగా విధుల్లో కొనసాగాలన్నారు. లంక గ్రామాల్లోని ప్రజలు పునరావాస కేంద్రాలకు తరలి రావాలని మైకుల ద్వారా సిబ్బంది దండోరా చేశారు. ఇప్పటికే చిలుమూరు, కొల్లూరు, దోనేపూడి, భట్టిప్రోలు మండలంలోని వెల్లటూరు, ఓలేరు వద్ద ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో సహాయ చర్యలకు అన్నీ సిద్ధం చేస్తున్నట్లు అధికారులు చెప్పారు. బ్యారేజీకి ఎగువ ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో ఆదివారం రాత్రికి బ్యారేజీ దగ్గర వరద ఉధృతి మరింత పెరగనుందనే అంచనాలు నదీ పరీవాహక ప్రాంతాల ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పెనుమూడికి వరదపోటు రానున్నదని అధికారులు అంచనా వేస్తున్నారు. అర్ధరాత్రికి వరద పెరిగే పరిస్థితి ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు. ఇప్పటికే వాణిజ్య పంటలు తుడిచిపెట్టుకుపోగా మళ్లీ వరద ముంచెత్తుతుందనే హెచ్చరికలతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఇప్పటికే వాణిజ్య పంటలు రోజుకో విధంగా రూపురేఖలు కోల్పోయి కుళ్లిపోతున్నాయి. భారీ వరదతో అన్నీ కోల్పోయినా ఇంకా కృష్ణమ్మ తమను కనికరించడం లేదంటూ ఆవేదన చెందుతున్నారు. తీర గ్రామాల్లో వరి పొలాల్లో నీరు తిష్ట వేసి ఉంది. రేపల్లె, వేమూరు నియోజకవర్గాల్లో 13 వేల ఎకరాలపైనే నీటిలోనే ఇంకా నానుతున్నాయి.

డీసీసీల నియామకం

- గుంటూరుకు చిలకా విజయ్‌కుమార్
- బాపట్ల జిల్లాకు మాజీ ఎమ్మెల్యే ఆమంచి
- పల్నాడు బాధ్యతలు మళ్లీ అలెగ్జాండర్ సుధాకర్‌కే
- ఏపీసీసీలో జిల్లా నేతలు పలువురికి దక్కిన పదవులు

గుంటూరు, సెప్టెంబరు 8: కాంగ్రెస్‌లో పదవుల పందేరం జరిగింది. ఇటీవల ఏఐసీసీ పీసీసీతో పాటు జిల్లా కాంగ్రెస్ కమిటీలను రద్దుచేసింది. ఈ క్రమంలో ఆ పార్టీ జిల్లాల అధ్యక్షులను నియమిస్తూ అధిష్ఠానం శనివారం ఉత్త ర్వులను జారీచేసింది. ఉమ్మడి జిల్లాలోని మూడు జి ల్లాలకు కొత్త అధ్యక్షులను నియమించారు. కాంగ్రెస్ గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా తాడికొండకు చెందిన చిలకా విజయ్‌కుమా ర్‌ను నియమించింది. ఈయన తాడికొండ నియోజకవర్గం నుం చి గత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. అలానే ప్ర స్తుతం పల్నాడు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడుగా ఉన్న అలెగ్జాండర్ సుధాకర్‌కు మరోసారి జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించారు. బాపట్ల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడుగా చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్‌ను నియమించారు. ఇప్పటి వరకు బాపట్ల జిల్లా అధ్యక్షుడుగా ఉన్న గంటా అంజిబాబును ఆ బాధ్యతల నుంచి తప్పించి ఏపీసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఇక ఏపీసీసీ కమిటీలోనూ ఉమ్మడి గుంటూరు జిల్లా నేతలు పలువురికి స్థానం దక్కింది. ఏపీసీసీ ప్రధాన కార్యదర్శిగా వరుసగా మూడో సారి ప్రత్తిపాడు నియోజక వర్గానికి చెందిన మదన మోహన్‌రెడ్డికి స్థానం దక్కింది. ఏపీసీసీ ప్రధాన కార్యదర్శులుగా కారుమంచి రమాదేవి, గడ్డం పాల్ విజయ్‌కుమార్, ఏపీసీసీ ఉపాధ్యక్షులుగా కొరివి వినయ్‌కుమార్, ఎమ్ సూర్యానాయక్‌లు ఉన్నారు. మొన్నటి వరకు ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వ్యవహరించిన మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలికి ఏపీసీసీలో చోటు దక్కే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి.



చిలకా విజయ్‌కుమార్



అలెగ్జాండర్ సుధాకర్



ఆమంచి కృష్ణమోహన్

రహదారులు.. ఛిద్రం

- వర్షాలకు కొట్టుకుపోయిన రోడ్లు
- డైవర్షన్ల వద్ద నిలిచిన రాకపోకలు
- ప్రధాన మార్గాలూ గుంతలమయం
- ఇబ్బందులు పడుతున్న వాహన చోదకులు

ఆంధ్రజ్యోతి - న్యూస్‌నెట్‌వర్క్, సెప్టెంబరు 8: రహదారులు అధ్వానం.. ప్రయాణం నరకం. అసలే అంతంతమాత్రంగా ఉన్న రోడ్లను వర్షాలు, వరదలు ధ్వంసం చేశాయి. పది రోజుల నుంచి కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా చాలాప్రాంతాల్లో రోడ్లు కొట్టుకుపోయాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తుండటంతో చప్టాలు గోతులమయంగా మారగా, డైవర్షన్ రోడ్లు కొట్టుకుపోయాయి. మరికొన్ని దగ్గర్ల కోతకు గురయ్యాయి. గోతులు, గుంతలతో నిండిపోయిన రోడ్ల రాకపోకలకు వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఐదేళ్లుగా సరైన నిర్వహణ లేని రోడ్లను తాజా వర్షాలు అధ్వానంగా మార్చాయి. గుంటూరుతో పాటు జిల్లాకేంద్రాలైన బాపట్ల, నరసరావుపేటల్లో సైతం రోడ్లు గోతులతో నిండి ఉన్నాయి. ప్రధాన రోడ్లు కూడా వర్షాల తాకిడికి గుంతలు పడి తారు, సిమెంటు లేచిపోయి రాళ్లు బయట పడి వాహనదారులతో పాటు పాదచారులు ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్లపై ఏర్పడిన భారీ గుంతల్లో వర్షపు నీరు నిలిచి తటాకాలను తలపిస్తున్నాయి. ఎక్కడ గొయ్యి ఉందో ఎక్కడ మెరక ఉందో అర్థం కాని పరిస్థితి. గోతులలో నీరు చేరడంతో వాహనాలపై వాహన చోదకులు ప్రమాదాల బారిన పడి గాయాలపాలవుతున్నారు. మరికొన్నిచోట్ల రోడ్డుపై వేసిన తారు లేచిపోయి అడుగున రాళ్లు బయటపడటంతో వాహనాలు దెబ్బతింటున్నాయి. రాత్రుళ్లు గోతులు అర్థం కాక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. నియోజకవర్గ కేంద్రాలు, మండలాల్లోని ఆర్అండ్‌బీ, పంచాయతీ రోడ్లు అధ్వానంగా మారాయి. లో లెవల్ చప్టాలపై వర్షపు నీరు ఉధృతంగా ప్రవహించడంతో రోడ్లు కోతలకు గురయ్యాయి. భారీ వర్షాలతో పలుచోట్ల వంతెనలు, చప్టాలు దెబ్బతిన్నాయి. పలు ప్రాంతాల్లో డైవర్షన్ రోడ్లు అయితే చాలావరకు కొట్టుకుపోయి.. ఆయా మార్గాల్లో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ రహదారులు ప్రయాణికులకు నరకం చూపిస్తున్నాయి. ఒక గ్రామం నుంచి మరొక గ్రామానికి ప్రజలు ప్రయాణం చేయాలంటే కత్తి మీద సాములా మారింది.

- తెనాలి నుంచి నారాకోడూరు, కాజీపేట మీదగా గుంటూరు, తెనాలి నుంచి కూచిపూడి, తెనాలి నుంచి మంగళగిరి రోడ్లు గుంతలయంగా మారాయి. అంగలకుదురు - సంగంజాగర్లమూడి రోడ్డు సగభాగం కోతకు గురై ప్రమాదకరంగా మారింది. నందివెలుగు - కొలకలూరు ఫ్లైఓవర్ సమీపంలోని రోడ్డు అడుగుకోక గుంతగా ఏర్పడింది.



నిజాంపట్నం రోడ్డులో ప్రధాన రహదారిపై ఏర్పడిన భారీగుంత

- మంగళగిరి పట్టణంలో అంతర్గత రహదార్లు అధ్వానంగా తయారయ్యాయి. చినకాకాని ఎన్నారై వద్ద గౌతమబుద్ధ రోడ్డు కోత గురైంది. తెనాలి రోడ్డులో ఇండోర్ స్విమ్మింగ్ పూల్ ఎదురుగా రహదారి గుంతలమయమైంది.
- తాడికొండ మార్గంలో కొండవీటి వాగు ఉధృతంగా ప్రవహించడంతో గుంటూరు-అమరావతి రహదారిలో రాకపోకలు నిలిచపోయాయి. పొన్నెకల్లు-దామరపల్లి ప్రధాన రహదారి తటాకాన్ని తలపిస్తుంది. లాం-దామరపల్లి, పొన్నెకల్లులోని లోలెవల్ చప్టాలు కొట్టుపోయి ప్రమాద భరితంగా మారాయి. తాడికొండ-కంతేరు మధ్య ఎర్రవాగు లోలెవల్ చప్టాకి ఇరువైపుల ఉన్న తారురోడ్డు కొట్టుపోయింది. సుమారు అర కిలోమీటర మేర రోడ్డు కోతలు పడి 20 ఏళ్ల క్రితం వేసిన రోడ్డు బయటపడింది.
- కృష్ణానదికి వచ్చిన వరదతో భట్టిప్రోలు, కొల్లూరు మండలాల్లోని 22 లంక గ్రామాల్లో రహదారులు కొట్టుకుపోయాయి. కొల్లూరు కరకట్ట దిగువ నుంచి ఆవులవారిపాలెం వరకు ఆర్ అండ్ బీ రోడ్డు వరద ఉధృతికి కొట్టుకుపోగా ముఖ్యమంత్రి పర్యటన ఉంటుందని తాత్కాలిక మరమ్మతులు చేశారు.
- పిట్టలవానిపాలెం మండలం చందోలు నుంచి సంగుపాలెం కోడూరు మీదగా పొన్నూరు వెళ్లే మార్గాల్లో రోడ్డెక్కడో గుంతలు ఎక్కడో అన్నచందంగా పరిస్థితి మారింది. చందోలు-పొన్నూరు రహదారిపై చీకట్లో ప్రయాణం ప్రాణసంకటంగా మారిందని ప్రయాణికులు గగ్గోలుపెడుతున్నారు.
- బాపట్ల మండలం పడమర బాపట్ల పంచాయతీ నాగేంద్రపురం వెళ్ళేరోడ్డుతోపాటు పోతురాజు కొత్తపాలెం ప్రధాన రహదారి గుంతల మయంగా మారింది. ఈతేరు గ్రామం నుంచి గుడిపూడి మీదగా కర్లపాలెం వెళ్ళేరోడ్డుపై ప్రయాణం నరకయాతనగా ఉంటుందని వాహనచోదకులు వాపోతున్నారు. కర్లపాలెం మండలం పెదగొల్లపాలెంలో బీటీ రోడ్డు దెబ్బతింది.
- రేపల్లె నియోజకవర్గంలోని నల్లూరుపాలెం, పోటుమెరక, తుమ్మల, కట్టవ, మృత్యుంజయపాలెం, గంగడిపాలెం, చెన్నువారిపాలెం, లంకేవానిదిబ్బ వరకు రహదారుల్లో గుంతలు ఏర్పడ్డాయి. పెనుమూడి నుంచి రావిఅనంతవరం, ఓలేరు, పెద్దపులివర్రు వరకు రహదారి దెబ్బతింది. రేపల్లెలోని పెనుమూడి రోడ్డు, బేతపూడి అడ్డరోడ్డు నుంచి గుడ్డికాయలంక లాకుల వరకు బేతపూడి అడ్డరోడ్డు నుంచి సజావారిపాలెం వరకు రహదారంతా ప్రమాదభరితంగా మారింది. సజ్జావారిపాలెం నుంచి శింగుపాలెం, పల్లపట్ల, పల్లమెరక, అడవులదీవి రహదారి పూర్తిగా దెబ్బతింది.



బాపట్ల నియోజకవర్గంలో అడుగడుగునా గుంతలుగా మారిన చందోలు-పొన్నూరు ఆర్‌అండ్‌బీ రోడ్డు



రేపల్లె మండలం పోటుమెరక సమీపంలో గుంతలమయంగా రహదారి



రేపల్లె: వడ్డివారిపాలెం సమీపంలో వర్షాలకు ఛిద్రమైన రహదారి



రేపల్లె: పోటుమెరక సమీపంలో గుంతలమయంగా మారిన రహదారి

2024 మార్చి 21న ఎం.కె.రంజిత్ సిన్హా అండ్ అదర్స్ కేసులో వాతావరణ మార్పుల దుష్ప్రభావాలనుంచి పర్యావరణాన్ని రక్షించుకోవడం 'ప్రాథమిక మానవహక్కు' అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు చొరవ ప్రదర్శించి, క్రియాశీలతతో తీర్పును వెలువరించినట్లుగా పర్యావరణ ప్రేమికులు, మేధావులు వ్యాఖ్యానించారు. ఈ సందర్భంలో న్యాయ వ్యవస్థ క్రియాశీలతను సమగ్రంగా అధ్యయనం చేద్దాం.

గ్రూప్-1 మెయిన్స్ ప్రత్యేకం

ఇండియన్ పాలిటీ

న్యాయ వ్యవస్థ క్రియాశీలత

న్యాయశాఖ క్రియాశీలత అనేది న్యాయసమీక్షాధికారంలో అంతర్భాగం. న్యాయశాఖ క్రియాశీలత అనగా న్యాయవ్యవస్థ తన అధికార విధులను మరింత చొరవగా, క్రియాశీలకంగా, ఉదారంగా వినియోగించడం. న్యాయాన్ని ప్రజలకు అందించే క్రమంలో అనేక నూతన పద్ధతులను, ప్రక్రియలను వినియోగించి సమ న్యాయపాలనకు అవసరమైన అన్ని చర్యలను చేపడుతుంది. సామాజిక హక్కులను రక్షిస్తూ, సామాన్య ప్రజలకు న్యాయాన్ని అందుబాటులోకి తీసుకురావడానికి సుప్రీం కోర్టు, అపెక్స్ జ్యుడీషియల్ బాడీగా దీనికి కేంద్ర బిందువు అయ్యింది.

న్యాయపరమైన కృతశీలత అనేది చట్టాలను చొరవతో, చురుగ్గా వివరించే సందర్భాలను సూచిస్తుంది. న్యాసమీక్ష సాంప్రదాయ సరిహద్దులను దాటి రాజ్యాంగ విలువలను సమర్థించే విషయాల్లో జోక్యం చేసుకుంటుంది.

చేసింది. కేశవానంద భారతి కేసు(1973)లో సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పు పార్లమెంటు అధికారాలపై పరిమితులు విధిస్తూ పరోక్షంగా న్యాయవ్యవస్థ పరిధిని విస్తృతం చేసింది. ఈ తీర్పులో రాజ్యాంగ మౌలిక స్వరూప సిద్ధాంతాన్ని వెలువరించింది. తరవాత కేసుల్లో కూడా తన తీర్పుల ద్వారా దానిని కొనసాగించింది.

ఎమర్జెన్సీ తరవాత వచ్చిన రాజకీయ-పౌరచైతన్యం వల్ల ప్రజాహిత వ్యాజ్యాలు(పిల్) వాడుకలోకి వచ్చాయి. న్యాయ సహాయాన్ని అందించమని నేరుగా న్యాయవ్యవస్థను కోరేలా ప్రజాహిత వ్యాజ్యాలు ప్రజలను చైతన్య పరిచాయి. శాసన



న్యాయవ్యవస్థ క్రియాశీలత - పరిణామం

గోలక్‌నాథ్ కేసు సుప్రీంకోర్టుకు వచ్చేవరకు ప్రాథమిక హక్కుల సవరణతోపాటు పార్లమెంటు చేసిన చట్టాలన్నింటిపై సుప్రీంకోర్టు ఎలాంటి విభేదాన్ని ప్రకటించలేదు. కానీ 17వ రాజ్యాంగ సవరణ(1964) ద్వారా అప్పుడు ప్రాథమిక హక్కుగా ఉన్న ఆస్తిహక్కును సవరిస్తూ పార్లమెంటు చట్టం చేసింది. అయితే ప్రాథమికహక్కు అయి న ఆస్తిహక్కును సవరించే అధికారం ప్రకరణ-368 కింద పార్లమెంటుకు లేదని గోలక్‌నాథ్ కేసు(1967)లో సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ తీర్పు నుంచే పార్లమెంటుకు న్యాయవ్యవస్థకు మధ్య ఘర్షణ ప్రారంభమైందని రాజనీతి శాస్త్రవేత్తల అభిప్రాయం. ఈ ఘర్షణ పరోక్షంగా న్యాయవ్యవస్థ క్రియాశీలతకు దోహదం

శాఖ, కార్యనిర్వాహక శాఖల బలహీనతే న్యాయశాఖ క్రియాశీలతకు కారణమని రాజ్యాంగవాదుల అభిప్రాయం.

ప్రజాప్రయోజనాల వ్యాజ్యాలు వాడుకలోకి వచ్చినప్పటి నుంచి పౌరులు, స్వచ్ఛంద సంస్థలు మిగిలిన రెండు శాఖల కార్యకలాపాల్లో జోక్యం చేసుకుని 'ప్రజాహితాన్ని' కాపాడమని అర్థించడం న్యాయ వ్యవస్థకు బలాన్నిచ్చాయి. దాంతో కార్యనిర్వాహక శాఖ అధికారాల్లో న్యాయవ్యవస్థ జోక్యం చేసుకోవడం మొదలుపెట్టింది. ఉదాహరణకు కావేరి నదీ జలాల సమస్యను చర్చించడానికి దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశాన్ని ఏర్పాటుచేయాలని సుప్రీంకోర్టు సూచించడం. రోడ్లు, వంతెనలు నిర్మించాలని ప్రభుత్వానికి ఆదేశాలివ్వడం, రైళ్ల రాకపోకలకు 'సమయ పాలన' పట్టికలను రూపొందించాలని చెప్పడం, విద్యాసంస్థల్లో

దిక్సూచి DIKSUCHI

అడ్మిషన్లు ఎలా జరపాలో నిర్దేశించడం. ఈవిధమైన తీర్పులన్నింటినీ పరిశీలిస్తున్న రాజ్యాంగ మేధావులు 'న్యాయ వ్యవస్థతో నడుస్తున్న ప్రభుత్వాలు' అని వ్యాఖ్యానిస్తున్నారు. ఈ అతిక్రియాశీలతను కట్టడి చేయడానికి సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఎ.కె.మాథుర్, మార్కండేయ కట్జూ 'న్యాయ వ్యవస్థ సహేతుకత'ను ప్రతిపాదించారు. తరచుగా ఈ అతి క్రియాశీలతను వినియోగించడం ఆరోగ్యకరమైన సంకేతం కాదని న్యాయమూర్తి హెచ్.ఆర్.ఖన్నా అభిప్రాయపడ్డారు.

న్యాయశాఖ క్రియాశీలతకు కారణాలు

- శాసనశాఖ, కార్యనిర్వాహక శాఖ తమ విధుల నిర్వహణలో వైఫల్యం చెంది ప్రజల నమ్మకాన్ని కోల్పోవడం.
- ఓటుబ్యాంకు రాజకీయాల వల్ల దీర్ఘకాలిక, నిర్మాణాత్మక, కఠినమైన నిర్ణయాలు చేయకపోవడం వల్ల ప్రజల కనీస అవసరాలు కూడా మెరుగుపర్చని స్థితిలో ప్రభుత్వాలు కొనసాగడం.
- ప్రజాప్రయోజనాల వ్యాజ్యంతో మూడో వ్యక్తి కూడా కోర్టును ఆశ్రయించే అవకాశం లభించింది. దాంతో స్వచ్ఛంద సంస్థలు, పౌర హక్కుల సంఘాలు వందల సంఖ్యలో ప్రజా ప్రయోజనాలున్న కేసులను హైకోర్టు, సుప్రీంకోర్టు దృష్టికి తీసుకువచ్చాయి.
- న్యాయస్థానాలు స్వయంప్రేరిత కేసులను ప్రవేశపెట్టి ప్రజల హక్కుల కోసం తగిన ఆదేశాలను జారీచేయడం.(ఉదాహరణకు కోర్టుకు వచ్చిన ఉత్తరాల ద్వారా, పేపర్లలో వచ్చిన వార్తల ఆధారంగా తనంత తానుగా ఆ సంఘటనలను విచారణకు స్వీకరించడం).
- దత్త శాసనాధికారాల వల్ల కార్యనిర్వాహక శాఖ అధికారాలు విస్తృతమై అధికార దుర్వినియోగం, జవాబుదారీతనం లోపించడం.



డాక్టర్ సుంకర రమాదేవి,
అసిస్టెంట్ ప్రొఫెసర్

న్యాయశాఖ క్రియాశీలత - ముఖ్య వివాదాలు

- ఫరీదాబాద్ గనుల్లో పనిచేసే బాల కార్మికుల స్థితిగతులపై బందువా ముక్తి మోర్చా వివాదంలో సుప్రీంకోర్టు తీర్పు.
- లక్ష్మీకాంత్, యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న మోసాలు, చిన్నపిల్లల దత్తత వివాదంలో సుప్రీంకోర్టు తీర్పులు.
- తాజ్‌మహల్ పరిసర ప్రాంతాల్లో కాలు ష్యం, తద్వారా తాజ్ మహల్‌కు ఉన్న ముప్పుపై కేసులు.
- బిహార్ ఖైదీల కేసు; బిహార్ పశుగ్రాసం కేసు.
- జార్ఖండ్ ముక్తిమోర్చా అవినీతి వివాదం.
- రక్షణశాఖలో కొనుగోలు కుంభకోణాలు మొదలైన వివాదాలు.
- జడ్జిల నియామకం.
- కర్ణాటక ముఖ్యమంత్రి ఎస్.ఆర్.బొమ్మై కేసు(1994)లో 356వ ప్రకరణ దుర్వినియోగాన్ని అరికట్టడానికి కొన్ని సూచనలివ్వడం.
- సతీష్‌శర్మ - పెట్రోల్ బంకుల కేటాయింపుల దుర్వినియోగం.
- గంగానది కాలుష్య నివారణ.
- వాహన కాలుష్యం వల్ల ఢిల్లీవాసుల జీవించేహక్కుకు భంగం కలిగిందంటూ ఒక పౌరుడు వేసిన కేసులో డీజిల్ బస్సులను సీఎన్‌జీ బస్సులుగా మార్చాలని ఆదేశించడం.
- అడవుల్లో చెట్లను విచక్షణారహితంగా నరికివేయడానికి సంబంధించి.
- కాలుష్య కారక పరిశ్రమలను మూసివేయాలంటూ ఆదేశించడం.
- ఢిల్లీలో అక్రమ నిర్మాణాలను తొలగించడం.

గుప్తా వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు(1982)లో మహారాష్ట్ర హైకోర్టు తీర్పు చెబుతూ న్యాయస్థానాలు క్రియాశీలకంగా వ్యవహరిస్తాయని పేర్కొంది. ఆదే విధంగా పీయూడీఆర్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు(1982)ను కూడా ఇక్కడ పేర్కొనవచ్చు. 9వ ఆసియా క్రీడల కోసం చేపట్టిన నిర్మాణాల్లో పాల్గొనడానికి వచ్చిన వారి శ్రమను యాజమాన్యం దోచుకుంటోందని ఒక స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని స్వీకరించి కార్మికులకు పని గంటలను నిర్ధారించింది.

1998 ప్రాంతంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ ఎం.కె.బెజ్‌బారువాను ఆ శాఖ నుంచి మరో శాఖకు బదిలీ చేశారు. ఈ బదిలీ సహజంగా జరిగింది కాదని, ఉద్దేశపూర్వకంగా చేశారని సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. సుప్రీంకోర్టు బెజ్ బారువా బదిలీ విషయంలో కేంద్రప్రభుత్వ చర్యను తప్పుపట్టింది.

- ఐ.ఆర్.కొయల్హో కేసు(2007)లో 9వ షెడ్యూల్‌లోని అంశాలను కూడా న్యాయసమీక్ష చేయవచ్చని తీర్పుచెప్పడం.
- శ్రేయోసింఘాల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో ఐటీ చట్టంలోని సెక్షన్ 66ఏను కొట్టివేయడం(2015).
- ఉన్నత న్యాయస్థానాల్లో జడ్జిల నియామకాలకు సంబంధించి కొలీజియం వ్యవస్థను పునరుద్ధరించడం(2015)
- రామ్‌సింగ్ కేసు(2015)లో వెనుకబడిన తరగతుల కమిషన్ సిఫార్సులకు వ్యతిరేకంగా జాట్‌లను ఓబీసీల్లో చేర్చడాన్ని కొట్టివేయడం.

లెటర్ రిపీటెడ్ సిరీస్

● రీజనింగ్

లెటర్ సిరీస్‌కు సంబంధించిన ప్రశ్నల్లో కొన్ని అక్షరాల సమూహాలను ఒక సిరీస్‌గా పేర్కొంటారు. ఈ అక్షర సమూహాలు రకరకాలుగా ఉంటాయి. అనగా 3, 4, 5 లేదా 6 అక్షరాలు గల సమూహాలు రిపీటెడ్‌గా రావడం.

ఉదా: dabc/dabc/dabc/dabc. లేదా

ఒక క్రమపద్ధతిలో అక్షర సమూహాలు విభజించడం.

ఉదా: ab/aabb/aaabbb/aaaabbbb.

గమనించండి: మొదటి సమూహంలో ఒక ab, రెండో సమూహంలో రెండు aలు, రెండు bలు, మూడో సమూహంలో మూడు aలు, మూడు b లు ఇలా ఒక క్రమపద్ధతిని అనుసరించి సిరీస్ ఏర్పడుతుంది. లేదా ఒక్కోసారి చెయిన్ పద్ధతిలో అక్షర సమూహాలు ఉంటాయి.

ఉదా: abc/bca/cab/abc.

మొదటి సమూహంలో చివరి రెండు అక్షరాలు రెండో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా, మొదటి సమూహంలో మొదటి అక్షరం రెండో సమూహంలో చివర ఉన్నది. అదేవిధంగా రెండో సమూహంలో చివరి రెండు అక్షరాలు మూడో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా, రెండో సమూహంలో మొదటి అక్షరం మూడో సమూహంలో చివరి అక్షరంగా ఉన్నది. ఈ విధంగా ఒక సక్రమమైన చెయిన్ పద్ధతిలో ఈ సిరీస్ ఉన్నది.

ఏపీపీఎస్సీ పోటీ పరీక్షల ప్రత్యేకం

ఈ విభాగానికి సంబంధించిన ప్రశ్నలు ఉండే పద్ధతి

కొన్ని అక్షరాల సమూహాన్ని ఒక సిరీస్‌గా పేర్కొంటారని పైన చెప్పుకున్నాం. ఈ అక్షరాల మధ్య మధ్య కొన్ని అక్షరాలను వదిలేస్తారు. ఆ సిరీస్‌లో వదిలేసిన అక్షరాల సమూహం ఐచ్ఛికాలుగా ఇచ్చిన ఎ, బి, సి, డిలలో ఉంటుంది. కాబట్టి ప్రశ్నగా ఇచ్చిన సిరీస్ ఏ క్రమపద్ధతిని అనుసరిస్తున్నదో తెలుసుకోవాలంటే ఐచ్ఛికాలుగా ఇచ్చిన ఎ, బి, సి, డిలలో గల అక్షరాలను ప్రశ్నలోని ఖాళీల్లో పూరించి సిరీస్‌ని అవగాహన చేసుకోవాలి. సమాధానాలుగా ఇచ్చిన ఎ, బి, సి, డిలలో ఏ ఆప్షన్‌లోని అక్షరాలను ఖాళీల్లో పూరించిన ఆ సిరీస్ క్రమపద్ధతిని అనుసరిస్తుందో ఆ ఆప్షన్‌ను సమాధానంగా గుర్తించాలి.

ఈ సిరీస్‌కు సంబంధించిన ప్రశ్నలలో అభ్యర్థి ముందుగా ఆ సిరీస్‌లో ఉపయోగించిన అక్షరాలు గమనించాలి. మూడు అక్షరాలు ఉపయోగిస్తే మూడు అక్షరాల సమూహంగా నాలుగు అక్షరాలు ఉపయోగిస్తే నాలుగు అక్షరాల సమూహంగా విభజించే అవకాశం ఉంది. అలా కాని పక్షంలో

1. సిరీస్‌లో మొత్తం 12 ఉంటే(ఖాళీలు, అక్షరాలు కలిసి) 3 లేదా 4గా విభజించే అవకాశం ఎక్కువ.
2. సిరీస్‌లో మొత్తం 16 ఉంటే(ఖాళీలు, అక్షరాలు కలిసి) 4గా విభజించే అవకాశం ఎక్కువ.
3. సిరీస్‌లో మొత్తం 15 ఉంటే(ఖాళీలు, అక్షరాలు కలిసి) 3 లేదా 5గా విభజించే అవకాశం ఎక్కువ
4. సిరీస్‌లో మొత్తం 20 ఉంటే(ఖాళీలు, అక్షరాలు కలిసి) 4 లేదా 5 విభజించే అవకాశం ఎక్కువ
5. సిరీస్‌లో మొత్తం 14 ఉంటే(ఖాళీలు, అక్షరాలు కలిసి) 2/3/4/5 గా విభజించవచ్చు.

ఉదా: PQ/PQQ/PQQQ/PQQQQ

ప్రతి సమూహంలో 'Q' ఒక్కొక్కటి పెరిగింది.

6. సిరీస్‌లో 18 ఉంటే(అక్షరాలు, ఖాళీలు కలిసి) 3 లేదా 4 లేదా 6గా విభజించే అవకాశం ఎక్కువ ఒక్కోసారి 3/4/5/6గా కూడా ఉండే అవకాశం ఉంటుంది.

ఉదా: abc/aabc/aabbc/aabbcc.

మొదటి సమూహం నుంచి రెండో సమూహానికి a పెరిగింది. రెండో సమూహం నుంచి మూడో సమూహానికి b పెరిగింది. మూడో సమూహం నుంచి 4వ సమూహానికి c పెరిగింది. ఈ లెటర్ సిరీస్‌కు సంబంధించి ప్రశ్నలు ఏవిధంగా ఉంటాయో, గత వివిధ పోటీ పరీక్షలలో ఇస్తున్న, ముఖ్యమైన సిరీస్ పద్ధతులను అభ్యర్థులకు ఈ చాప్టర్‌పై అవగాహన కలిగించేందుకు దిగువ ఇస్తున్నాం. దిగువ ఇచ్చిన సిరీస్ పద్ధతులను అభ్యర్థులు కనీసం ఐదు లేదా ఆరుసార్లు చదివి జాగ్రత్తగా పరిశీలించి సిరీస్‌లో అక్షరాల విభజన, సిరీస్‌లు ఏర్పడే విధానం, వాటి స్వభావంపై అవగాహన ఏర్పరచుకొని ఈ చాప్టర్‌పై పట్టుసాధించగలరని ఆశిస్తున్నాం.

ఈ విభాగానికి సంబంధించిన ప్రశ్నల్లో ఉండే అక్షరాలు P, Q, R, S లేదా a,b,c,d లేదా K,L,M,N అయి ఉంటాయి.

వివిధ రకాలైన సిరీస్ పద్ధతులు

1. ab/ab/ab/ab/ab/ab
   రెండేసి అక్షరాలు ఒక సమూహంగా రిపీట్ అవుతున్నది.
2. PQR/PQR/PQR/PQR
   మూడేసి అక్షరాలు ఒక సమూహంగా రిపీట్ అవుతున్నది.
3. dcab/dcab/dcab/dcab
   నాలుగేసి అక్షరాలు ఒక సమూహంగా రిపీట్ అవుతున్నది.
4. adcbc/adcbc/adcbc
   ఐదేసి అక్షరాలు ఒక సమూహంగా రిపీట్ అవుతున్నది.
5. dacbad/dacbad/dacbad
   ఆరేసి అక్షరాలు ఒక సమూహంగా రిపీట్ అవుతున్నది.
6. abba/baab/abba/baab
   మొదటి సమూహంలో గల అక్షరాలు abba. ఈ సమూహంలో చివరి రెండు అక్షరాలు(ba) రెండో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా, మొదటి సమూహంలో మొదటి రెండు అక్షరాలు(ab) రెండో సమూహంలో చివరి రెండు అక్షరాలుగా ఉన్నాయి.
   రెండో సమూహంలో చివరి రెండు అక్షరాలు (ab) మూడో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా, రెండో సమూహంలో మొదటి రెండు అక్షరాలు (ba) మూడో సమూహంలో చివరి రెండు అక్షరాలుగా ఉన్నాయి. ఈ విధంగా ఒక క్రమపద్ధతిని అనుసరిస్తూ ఈ సిరీస్ ఏర్పడింది.
7. PQ/PPQQ/PPPQQQ/PPPPQQQQ
   మొదటి సమూహంలో రెండు అక్షరాలు, రెండో సమూహంలో నాలుగు అక్షరాలు, మూడో సమూహంలో ఆరు అక్షరాలు, నాలుగో సమూహంలో ఎనిమిది అక్షరాలు ఉన్నాయి. మొదటి సమూహంలో ఒక PQ, రెండో సమూహంలో రెండు Pలు, రెండు Qలు, మూడో సమూహంలో మూడు Pలు, మూడు Qలు ఉన్నాయి. ఈ విధంగా ఒక క్రమపద్ధతిని ఈ సిరీస్ అనుసరించింది.
8. abc/aabc/aabbc/aabbcc
   మొదటి సమూహంలో మూడు అక్షరాలు, రెండో సమూహంలో నాలుగు అక్షరాలు, మూడో సమూహంలో ఐదు అక్షరాలు, నాలుగో సమూహంలో ఆరు అక్షరాలు ఉన్నాయి. రెండో సమూహాన్ని గమనిస్తే మొదటి సమూహంలో గల అక్షరాలన్నీ ఉంటూ a స్థానం వద్ద మరొక a అదనంగా చేరింది. మూడో సమూహంలో రెండో సమూహంలో గల అక్షరాలన్నీ ఉంటూ b స్థానం వద్ద మరో b అదనంగా చేరింది. నాలుగో సమూహంలో మూడో సమూహంలో గల అక్షరాలన్నీ ఉంటూ c స్థానం వద్ద మరో c అదనంగా చేరింది. ఈ విధంగా ఒక క్రమపద్ధతిని ఈ సిరీస్ అనుసరించినది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్,
సీనియర్ ఫ్యాకల్టీ

వరదపై ఆగని జగన్ బురద

- వలంటీర్లు ఉంటే సమర్థంగా ఎదుర్కొనేవారట!
- ఎక్స్ వేదికగా జగన్ ట్వీట్.. విరుచుకుపడ్డ నెటిజన్లు
- జగన్ నిర్వాకమే ఈ వరద అంటూ మండిపాటు

అమరావతి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ అధినేత జగన్ వరదపై తన బురద రాజకీయాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు. వలంటీర్లు ఉంటే, ముంపును సమర్థవంతంగా ఎదుర్కొనేవారంటూ మరోసారి విషం కక్కారు. అసలు రాష్ట్రంలో ప్రభుత్వం అనేది ఉందా... లక్షల మంది ఉద్యోగులున్న ప్రభుత్వ యంత్రాంగం ఏమైపోయిందంటూ ఆదివారం ట్వీట్ చేశారు. ప్రభుత్వం మారకపోతే, వైసీపీ తరఫున పోరాటం చేస్తామన్నారు. నిజానికి, ఐదేళ్లపాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన అనుభవం కలిగిననేతగా, భుజం భుజం కలిపి, వరద బాధితులకు సాయమందించాల్సిన తరుణమిది. అది వదిలేసి జగన్ ట్వీట్ చేసిన బురద రాజకీయ వ్యాఖ్యల పట్ల జల వనరుల నిపుణుల నుంచి ప్రభుత్వ అధికారులు, బాధితులు, నెటిజన్లు వరకు.. సర్వత్రా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇదంతా మీ నిర్వాకమే..రాజకీయాలకు ఇదా సమయం అంటూ అత్యధిక నెటిజన్లు విరుచుకుపడ్డారు. సోషల్ మీడియాలో విమర్శలు మాని ఆకలి కేకలు పెడుతున్న బాధితులకు సాయం చేయాలంటూ ఘాటుగా సూచించారు.

వైసీపీ ఎత్తులు చిత్తు

వరద బాధితులకు పరామర్శ పేరిట రాద్ధాంతం చేసేందుకు ప్రయత్నించిన జగన్ ప్రయత్నాన్ని ఇటీవల వరదప్రాంతాల్లో మహిళలే వమ్ము చేశారు. తమకు ప్రభుత్వం నుంచి అన్నివిధాలా సాయమందుతోందంటూ స్పష్టంచేశారు. ఏమీరెంత సాయం అందిస్తున్నారంటూ పరామర్శకు వచ్చిన ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణను మహిళలు నిలదీశారు. దీంతో, బయటకు రాకుండా తాడేపల్లి ప్యాలెస్‌కే పరిమితమైన జగన్ .. ఎక్స్ వేదికగా మాత్రం బురద రాజకీయాలకు తెరతీశారని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులను కించపరిచేలా ఉన్న జగన్ వ్యాఖ్యలను పలువురు తీవ్రంగా తప్పుబడుతున్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో వినాయక చవితి సెలవు దినం కూడా ఉద్యోగులు పనిచేసిన విషయం వారు గుర్తుచేశారు.

బ్రహ్మాజీ కౌంటర్ ట్వీట్...

జగన్ ట్వీట్‌కు సినీనటుడు బ్రహ్మాజీ కౌంటర్ ట్వీట్ చేశారు. .మీరు కరెక్టు సార్. వాళ్లు చెయ్యలేరు సార్. ఇకనుంచి మనం చేద్దాంసార్. ఫస్ట్ మనం రూ.1000 కోట్లు రిలీజ్ చేద్దాం సర్. మన వైసీపీ కేడర్ మొత్తాన్ని రంగంలోకి దింపుదాం. మనకు జనాలు ముఖ్యం సార్. గవర్నమెంటు కాదు సార్. మనం చేసి చూపిద్దాం సార్.. జై జగన్ అన్నారు అని ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు. అయితే, ఆ ట్వీట్ తాను చేయలేదని, తన ఖాతా హ్యాక్ అయిందని, ఫిర్యాదు కూడా చేశానని బ్రహ్మాజీ వివరణ ఇచ్చారు.

దుష్ప్రచారాన్ని సహించొద్దు..

- సోషల్ మీడియాలో పోస్టులపై ప్రభుత్వం సీరియస్
- మితిమీరితే ఊరుకోబోనని ముఖ్యమంత్రి హెచ్చరిక

అమరావతి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వరద సహాయ కార్యక్రమాలపై సామాజిక మాధ్యమాల్లో చేస్తున్న దుష్ప్రచారంపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా ఉంది. ఆ పోస్టులు పెడుతున్నవారెవరో ఆరా తీయాలని నిర్ణయించింది. మితిమీరితే శిక్ష తప్పదని హెచ్చరిస్తోంది. తాజాగా వరద సాయం విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంబంధాలపై అనుమానాలు రేకెత్తించేలా సోషల్ మీడియాలో పోస్టులు మొదలయ్యాయి. ఇంతవరకూ కేంద్రం సాయం ప్రకటించకపోవడంపై చంద్రబాబు ప్రభుత్వం అసహనంగా ఉందని... దీంతో ఇరు ప్రభుత్వాల మధ్య సంబంధాలు దెబ్బ తిన్నాయని ఈ పోస్టుల్లో పేర్కొంటున్నారు. కొద్ది రోజుల్లో కేంద్ర మంత్రివర్గం నుంచి టీడీపీ బయటకు వచ్చేసి, ఎన్డీయే కూటమికి గుడ్ బై చెబుతుందనే ప్రచారం చేస్తున్నారు. కేంద్ర సాయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు రెండు రోజుల క్రితమే స్పష్టత ఇచ్చారు. తాము నష్టానికి సంబంధించి ప్రాథమిక నివేదిక పంపకుండానే కేంద్రం సాయం ప్రకటించడం సాధ్యం కాదని, తాము ఇంకా నివేదిక పంపలేదని చెప్పారు. .ఎమరీ అతిగా ప్రవర్తిస్తున్నారు. వైసీపీ నుంచే ఇటువంటి దుష్ప్రచారం నడుస్తోంది. మరీ మితిమీరిపోతే మేం సీరియస్‌గా తీసుకుంటాం. దానికి తగిన శిక్ష ఉంటుంద్ అని హెచ్చరించారు.

బెజవాడ అనుభవంతో భద్రం!

- భారీ వర్షాలతో ఉత్తరాంధ్రకు వరద ముప్పు
- ప్రాణ, ఆస్తి, పంట నష్టం తగ్గించాలి
- ప్రజల ఫోన్లకు అలర్ట్ మెసేజ్‌లు
- ఆహార సరఫరాకు డ్రోన్లు వాడండి
- ఏలేరు ప్రాజెక్టు వద్ద గట్టి చర్యలు
- కలెక్టర్లు, ఎస్పీలతో సీఎం టెలికాన్ఫరెన్స్

అమరావతి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో కురుస్తున్న భారీవర్షాలతో ప్రజలు ఇబ్బంది పడకుండా పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని అధికార యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. విజయవాడ వరదను గమనంలో ఉంచుకుని ముందస్తు చర్యలను వేగంగా తీసుకోవాలని సూచించారు. ప్రభావిత ప్రాంతాల ప్రజల ఫోన్లకు అలర్ట్ మెసేజ్‌లు పంపాలని కోరారు. ఆదివారం జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, సంబంధిత అధికారులతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. "ఉత్తరాంధ్ర జిల్లాల్లో వరదల ప్రభావం కనిపిస్తోంది. అన్ని జిల్లాల కలెక్టర్లు కూడా అప్రమత్తం కావాలి. నాగావళి, వంశధార నదులకు వరద పెరిగే అవకాశం ఉంది. ఏలేరు రిజర్వాయర్‌కు ఎక్కువ వరద నీరు రావొచ్చు. ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో బ్యాలెన్స్ చేసుకుని, సమర్థవంతంగా వ్యవహరించాలి. కాలువలు, చెరువులు, డ్రెయిన్లకు గండ్లు పడకుండా చూసుకోవాలి. భారీ, అతిభారీ వర్షాలు పడేందుకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో తాగు నీరు, ఆహారం, మెడికల్ క్యాంప్‌లను సిద్ధం చేయాలి. ప్రజలను నిరంతరం అప్రమత్తం చేస్తూ, ప్రాణనష్టం లేకుండా చూసుకోవాలి. ముందస్తు చర్యలతో ఆస్తి నష్టాన్ని తగ్గించాలి. పంట నష్టం అంచనా, బాధితులకు ఆహార సరఫరా, వరద పరిస్థితులను గమనించేందుకు డ్రోన్లు వినియోగించాలి. ప్రభావిత ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలి. అక్కడ వారికి అన్ని వసతులు కల్పించాలి. పరిస్థితి తీవ్రతను బట్టి, సహాయం కోసం సెంట్రల్ కంట్రోల్ టీమ్‌ను సంప్రదించాలి. ఏజెన్సీలో వాగులు, వంకలు దాటే సమయంలో ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా చూడాలి. వినాయకుని నిమజ్జనం కోసం చెరువులు, కాలువల వద్దకు వెళ్లే భక్తులు, ప్రమాదాలబారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. జిల్లాలవారీగా వర్షపాతం వివరాలను సీఎంకు కలెక్టర్లు వివరించారు. బాపట్ల జిల్లాలోని పునరావాస కేంద్రాల్లో పెరుగుతున్న బాధితులను దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లు పెంచుతున్నామని ఆ జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. రెండువేల మందికి పైగా ఇప్పటికే పునరావాస కేంద్రాలకు తరలించి, ఆహారం అందిస్తున్నామని ఏలూరు కలెక్టర్ కె. వెట్రి సెల్వీ చెప్పారు. విజయనగరంజిల్లాలో భారీ వర్షాలకు అనుగుణంగా రాకపోకలను నియంత్రిస్తున్నామని కలెక్టర్ అంబేడ్కర్ వివరించారు.



వరద పరిస్థితిని గవర్నర్‌కు వివరిస్తున్న సీఎం చంద్రబాబు

పండుగ రోజూ పరామర్శలే

ముఖ్యమంత్రి చంద్రబాబు వినాయకచవితి పండగ రోజు కూడా వరద బాధితులను పరామర్శించేందుకు విజయవాడలో పర్యటించారు. సింగ్‌నగర్‌లో వరదనీరు ఉండటంతో పొక్లెయిన్ ఎక్కి మారుమూల ముంపు ప్రాంతాలకు వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ఓవైపు వర్షం.. మరోవైపు వరద నీటిలోనే సుమారు మూడు గంటలపాటు సీఎం పర్యటన కొనసాగింది. బాధితులు తమ కష్టాలను ఆయనకు చెప్పుకొన్నారు. తీవ్రంగా నష్టపోయామని, ఇంట్లో ఉన్న వస్తువులు, వాహనాలు అన్నీ దెబ్బతిన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గండ్లు పూడ్చివేయడంతో వరద నీరు ఒకటి రెండు రోజుల్లో తగ్గిపోతుందని, ప్రతి ఒక్క కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని చంద్రబాబు...బాధితులకు భరోసా ఇచ్చారు. అనంతరం కాన్వాయ్‌లో తిరిగి విజయవాడ కలెక్టరేట్‌కు చేరుకున్నారు.

గవర్నర్‌ను కలిసిన చంద్రబాబు

- ప్రభుత్వ కృషిని ప్రశంసించిన అబ్దుల్ నజీర్

అమరావతి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివారం ఇక్కడ కలిశారు. విజయవాడలోని రాజ్ భవన్‌కు వెళ్లిన ఆయన గవర్నర్‌తో సుమారు గంటపాటు భేటీ అయ్యారు. విజయవాడ నగరాన్ని కనీవినీ ఎరుగని రీతిలో వరదలు ముంచెత్తడంతో ఆయన గవర్నర్‌ను కలసి ఈ పరిణామాలను వివరించారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో కూడా వరదల వల్ల జరిగిన నష్టం, బాధితులను ఆదుకోవడానికి తాము తీసుకొన్న చర్యలను చెప్పారు. ప్రభుత్వం సత్వరం స్పందించి యుద్ధ ప్రాతిపదికన బాధితులను ఆదుకోవడానికి తీసుకొన్న చర్యలను గవర్నర్ ఈ సందర్భంగా ప్రశంసించారు. ముఖ్యమంత్రి వ్యక్తిగతంగా బాధ్యత తీసుకొని సహాయ కార్యక్రమాలను పర్యవేక్షించడాన్ని మెచ్చుకొన్నారు. త్వరలోనే ముంపు ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులు నెలకొనగలవన్న ఆశాభావాన్ని గవర్నర్ వ్యక్తం చేశారు.

నేటి నుంచి నష్టం అంచనా

- 2.32 లక్షల నివాసాల్లో సర్వే
- వ్యాపార సంస్థల నష్టం కూడా
- కుటుంబ సభ్యులెవరున్నా నమోదు
- ధ్రువీకరణ కోసం ఆధార్ తప్పనిసరి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన వెల్లడి

విజయవాడ/అమరావతి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లాలోని వరద ముంపు ప్రాంతాల్లో ఆస్తి నష్టాన్ని అంచనా వేసే కార్యక్రమం సోమవారం ప్రారంభం కానుంది. 2.32 లక్షల గృహాలతోపాటు వాణిజ్య, వ్యాపార సంస్థలకు జరిగిన నష్టాన్ని అంచనా వేయనున్నారు. దీనికిగాను రెవెన్యూ, సచివాలయ సిబ్బందితో 17 వేల బృందాలను ఏర్పాటు చేశారు. నష్టం అంచనా నమోదుకు ప్రత్యేక యాప్‌ను రూపొందించారు. ఈ బృందాలకు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి(రెవెన్యూ) ఆర్‌పీ సిసోడియా నేతృత్వంలో ఆదివారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శిక్షణ ఇచ్చారు. అనంతరం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన మీడియాతో మాట్లాడుతూ ఎన్యూమరేషన్‌కు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఒక్కో బృందానికీ డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నేతృత్వం వహిస్తారని తెలిపారు. వారితోపాటు వార్డు సెక్రటరీ, వలంటీర్, పోలీసు సిబ్బంది ఒకరు ఉంటారన్నారు. మూడు రోజుల్లో నష్టాన్ని నమోదు చేస్తామన్నారు. ఎన్యూమరేషన్ ప్రక్రియను పర్యవేక్షించేందుకు ప్రతి వార్డుకు ఒక ఐఏఎస్ అధికారితోపాటు జిల్లా అధికారి ఒకరు పనిచేస్తారని తెలిపారు.

అందుబాటులో ఉండాలి!

ఎన్యూమరేషన్ బృందాలు వచ్చిన సమయంలో గృహ, వ్యాపార సంస్థల యజమానులు అందుబాటులో ఉండాలని కలెక్టర్ సృజన కోరారు. ఇళ్లకు తాళాలు వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు తిరిగి వస్తే ఎన్యూమరేషన్‌కు ఇబ్బంది లేకుండా ఉంటుందని సూచించారు. ఏదైనా కారణం వల్ల ఇంట్లో ఎవరూ లేకుంటే వార్డు సెక్రటరీకి సమాచారం ఇస్తే మరోసారి ఇంటికి వచ్చి ఎన్యూమరేషన్ చేస్తారని వివరించారు.

ఇళ్లే మొదట

తొలుత గృహాల్లో నష్టం అంచనాకు ప్రాధాన్యం ఇస్తారని కలెక్టర్ చెప్పారు. ఆ తర్వాత ఆటోలు, రిక్షాలు, తోపుడు బండ్లు తదితరాలకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. కాగా, విద్యార్థులతో కూడిన మరికొన్ని బృందాలు సమాంతర సర్వే నిర్వహించనున్నాయి.

వరద నష్టం 6,882 కోట్లు

- కేంద్రానికి రాష్ట్రం ప్రాథమిక నివేదిక

అమరావతి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): వరదల కారణంగా రూ.6,882 కోట్ల మేరకు నష్టం వాటిల్లిందని రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికంగా అంచనా వేసింది. క్షేత్రస్థాయిలో ఎన్యూమరేషన్ అనంతరం నష్టం మరింత పెరిగే అవకాశం ఉందని తెలిపింది. వరద నష్టంపై కేంద్ర ప్రభుత్వానికి శనివారం ప్రాథమిక నివేదికను పంపింది. రోడ్లు భవనాల శాఖకు రూ.2,165 కోట్ల నష్టం వాటిల్లిందని పేర్కొంది. జలవనరుల శాఖకు 1,569 కోట్లు, పట్టణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖలకు 1,160 కోట్లు, పశు సంవర్ధక శాఖకు రూ.12 కోట్లు, వ్యవసాయ శాఖకు 301 కోట్లు, మత్స్య శాఖకు 158 కోట్లు, ఉద్యానవన శాఖకు 40 కోట్లు, విద్యుత్ శాఖకు 481 కోట్లు గ్రామీణ నీటి పారుదల శాఖకు 76 కోట్లు, పంచాయితీరాజ్ పరిధిలోని రోడ్లకు 168 కోట్లు, అగ్నిమాపక శాఖకు 2 కోట్ల నష్టం జరిగినట్టు వివరించింది.

వాహనాల రిపేర్ ఖర్చు

కొంత భరిస్తాం

- ఇళ్లలో పాడైన పరికరాలకూ మరమ్మతులు
- తక్కువ ఖర్చైతే మేమే పెట్టుకొంటాం
- కంపెనీలు, బ్యాంకర్లతో చర్చలు
- ఒకటి, రెండు రోజుల్లో దీనిపై స్పష్టత
- రోడ్ల శుభ్రతపై డ్రోన్లతో తనిఖీ: సీఎం చంద్రబాబు

అమరావతి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విజయవాడ వరదల్లో మునిగిపోయి దెబ్బతిన్న వాహనాలు, ఇళ్లలో పరికరాల రిపేర్ల ఖర్చులో కొంత ప్రభుత్వం భరించడంపై ఆలోచన చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. ఒకటి, రెండు రోజుల్లో దీనిపై స్పష్టత వస్తుందని ఆయన తెలిపారు. ఆదివారం రాత్రి విజయవాడ కలెక్టరేట్ ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడారు. "వరదల్లో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు తదితర వాహనాలు పెద్ద సంఖ్యలో మునిగిపోయి దెబ్బ తిన్నాయి. వీటిలో కొన్నింటికి బీమా ఉంది. కొన్నింటికి లేదు. ఆథరైజ్డ్ మెకానిక్కుల వద్ద రిపేర్ చేయిస్తేనే బీమా వస్తుంది. కొందరు యజమానులు తమకు నమ్మకం ఉన్నవారి వద్ద రిపేర్ చేయించుకోవాలని అనుకొంటారు. బీమా లేని వాహనాల రిపేర్లు ఎలాగో ఆలోచించాలి. వాహనాల కంపెనీలతో ఈ విషయం మాట్లాడుతున్నాం. కంపెనీల వద్ద సీఎస్ఆర్ నిధులు ఉంటాయి. వాటి కింద ఉచితంగా రిపేర్లు చేయాలని అడుగుతున్నాం. తక్కువ ఖర్చయితే ప్రభుత్వం తరఫున మేం పెట్టుకొంటాం. మరీ ఎక్కువైతే కొంత ప్రభుత్వం...కొంత యజమానులు భరించేలా ఆలోచన చేస్తున్నాం. వరద ప్రాంతాల్లోని ఇళ్లలో రకరకాల ఎలక్ట్రానిక్ పరికరాలు పాడై పోయాయి. వాటిని ఆయా కంపెనీల తయారీదారులే మరమ్మతు చేయాలి. విడి భాగాలు వాళ్ల వద్దే ఉంటాయి. ఆ కంపెనీలతో కూడా మాట్లాడి తక్కువ ఖర్చుతో రిపేర్లు అయ్యే మార్గం అన్వేషిస్తున్నాం. ఇందులో కూడా వీలైతే కొంత ఖర్చు ప్రభుత్వం పెట్టుకొంటుంది. గ్యాస్ స్టవ్‌లు కూడా వాటిని కొన్న కంపెనీలే రిపేర్ చేయాలి. వాళ్లతో కూడా మాట్లాడుతున్నాం. ఎలక్ట్రికల్, ప్లంబింగ్, కార్పెంటరీ, పెయింటింగ్ వంటి పనులు అర్బన్ కంపెనీకి అప్పగిస్తున్నాం. ఆ కంపెనీకి ఇందులో ప్రావీణ్యం ఉంది. ఇతరత్రా ఎవరైనా ఈ పనులు చేసే వాళ్లు ఉంటే వాళ్లను కూడా ఈ కంపెనీకే అప్పగిస్తున్నాం. రేట్లు తక్కువలో ఉండేలా చూస్తాం. ఇవన్నీ ఒకటి రెండు రోజుల్లో తేలతాయి. వీటన్నింటిపైనా వివరంగా ఒక కరపత్రం తయారు చేసి ఇంటింటికీ పంపిస్తాం" అని ఆయన వివరించారు. చిన్న వ్యాపారాలు చేసుకొనేవారు, షాపులు నిర్వహించేవారు, పెద్ద వ్యాపారాలు చేసేవారు అందరూ నష్టపోయారని, వాళ్లను తిరిగి ఎలా గాడిలో పెట్టాలన్నదానిపై బ్యాంకర్లతో మాట్లాడుతున్నామని, కేంద్రం సహాయం కూడా కోరుతున్నామని ఆయన వివరించారు.

శుభ్రతపై డ్రోన్లతో తనిఖీ

వరద తగ్గిన తర్వాత ముంపు ప్రాంతాల్లో రోడ్లు, కాల్వలు శుభ్రం చేయిస్తున్నామని, ఎలా శుభ్రం చేశారో డ్రోన్లతో తనిఖీ చేయిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. డ్రోన్లు తీసిన వీడియోలు, ఫొటోలను క్షేత్రస్థాయిలో పని చేయించేవారికి పంపి ఎక్కడైనా సరిగ్గా చేయకపోతే మళ్లీ చేయిస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటు డ్రెయిన్లు శుభ్రం చేయలేదని, వరద కాల్వల పనులు నిలిపివేసిందని ఆయన విమర్శించారు. విజయవాడలో రెండు రోజుల్లో సాధారణ పరిస్థితులు నెలకొంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు. 'బుడమేరు కింద ఆక్రమణలు తొలగిస్తాం. ఈ నీరు సముద్రం చేరేవరకూ ఆటంకాలు లేకుండా అన్నీ తొలగిస్తాం. మళ్లీ విజయవాడకు వరద రాకుండా చేస్తాం' అన్నారు. ఈ 8 రోజుల్లో మొత్తం 97 లక్షల ఆహార ప్యాకెట్లు సరఫరా చేశామన్నారు.

మాన్యువల్ స్కావెంజర్ రహిత జిల్లాగా గుంటూరు

గుంటూరు (విద్య), సెప్టెంబరు 8: ఉమ్మడి గుంటూరు జిల్లాను మాన్యువల్ స్కావెంజర్ రహిత జిల్లాగా ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వం, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మున్సిపల్, పంచాయతీ అధికారులు మాన్యువల్ స్కావెంజర్స్, సెప్టిక్ ట్యాంక్‌లేని మరుగుదొడ్ల పై విస్తృత సర్వే నిర్వహించారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ఎక్కడా కూడా మాన్యువల్ స్కావెంజర్స్, (చేతులతో మల, మూత్రాలు శుభ్రం చేసే విధానం) సెప్టిక్ ట్యాంక్ లేని మరుగుదొడ్లు లేవని ఆగస్టు 14 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించిన సర్వేలో తేల్చారు. జిల్లాలో ఎక్కడైనా ఇటువంటి పరిస్థితి ఉంటే సాంఘిక సంక్షేమ శాఖ సాధికారిక సంస్థకు ఫిర్యాదు చేయాలని డిప్యూటీ డైరెక్టర్ డి.మధుసూదన్‌రావు విజ్ఞప్తి చేశారు. ఫిర్యాదుదారులు సెప్టెంబర్ 9 నుంచి 15లోగా సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయం ఆవరణలోని సాధికారిక సంస్థలో ఫిర్యాదు చేయాలని సూచించారు.

వైసీపీ ఎంపీటీసీ మెంబర్‌పై చోరీ కేసు

పొన్నూరుటౌన్, సెప్టెంబరు 8: పొన్నూరు మండలం మన్నవ గ్రామ వైసీసీ ఎంపీటీసీ మెంబర్ బొనిగల అమరేంద్ర ప్రసాద్‌పై చోరీ కేసును రూరల్ పోలీసులు నమోదు చేశారు.రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మన్నవ గ్రామ కార్యదర్శి పి.రవిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. పంచాయతీకి సంబంధించిన స్టాక్ రూమ్ తాళాలు పగలకొట్టి అక్రమంగా ప్రవేశించటమే కాకుండా పంచాయతీకి సంబంధించిన వస్తు సామగ్రి చోరీ చేసినట్లు కార్యదర్శి ఫిర్యాదులో పేర్కొన్నారు. పంచాయతీకి చెందిన మోటార్లు, ఫాగింగ్ మిషన్, స్ప్రేయర్లు, బ్లీచింగ్, సున్నం, విద్యుత్ పరికరాలు, మొక్కలకు సరఫరా అయిన వంద బస్తాల ఎరువు, రిక్షా వంటి వాహనంతోపాటు రూ. 5 లక్షలు విలువ కలిగిన వస్తువులను అమరేంద్ర ప్రసాద్ రిజిస్ట్రేషన్ లేని ట్రాక్టర్‌లో బొనిగల హైమారావు, రేగులగడ్డ సురేష్, బొనిగల సుమన్ బాబు, పేరం మల్లికార్జునరావు తదితరుల సహకారంతో చోరీ చేసి తీసుకెళ్లినట్లు గ్రామ కార్యదర్శి ఫిర్యాదు చేశారు. ఈ విషయం తెలిసి పంచాయతీ వార్డు సభ్యులు గొల్ల సాంబయ్య, పులిపాటి రాజారాణి ఆ ప్రాంతానికి వెళ్లి ప్రశ్నించగా వారిపై కూడా దాడి చేసినట్లు పంచాయతీ వార్డు సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఇద్దరు మృతి

పోట్లూరు(శావల్యాపురం)సెప్టెంబరు 8: దేవాలయానికి విద్యుత్ అలంకరణ చేస్తూ విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురై యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని పోట్లూరు గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగింది. ఎస్‌ఐ లేళ్ల లోకేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు పోట్లూరు ఎస్సీకాలనీకి చెందిన పోపూరి దయాకరణ్ (22) గ్రామంలో విద్యుత్ మరమ్మతులు చేసుకొంటూ జీవనం సాగిస్తుంటాడు. గ్రామంలోని వడ్డెర కాలనీలోని రోడ్డు పక్కనున్న నీలంపాటి అమ్మవారి దేవాలయానికి శుక్రవారం రాత్రి విద్యుత్ అలంకరణ చేస్తున్నారు. దేవాలయం పక్కనే విద్యుత్ సర్వీస్ తీగలున్న విషయాన్ని గమనించని దయాకరణ్ దేవాలయానికి విద్యుత్ తీగలు అమర్చి పైకి లేచాడు. దాంతో సర్వీస్ తీగలు తగలడంతో దేవాలయం పైనుంచి కింద పడ్డాడు. స్థానికులు వెంటనే ఆటోలో దయాకరణ్‌ను వినుకొండలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. దయాకరణ్‌కు తల్లిదండ్రులు, అన్నయ్య ఉన్నారు. మృతదేహాన్ని పోలీసులు వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమర్టం నిర్వహించారు.

ముప్పాళ్లలో మరొకరు..

ముప్పాళ్ళ, సెప్టెంబరు 8: వినాయక మండపం వద్ద విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతి చెందిన సంఘటన ముప్పాళ్లలో శుక్రవారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం మేరకు గ్రామానికి చెందిన ఈర్ల లక్ష్మయ్య(50) గొర్రెలు కాస్తూ జీవనం సాగిస్తుంటాడు. వినాయక చవితి సందర్భంగా తమ ప్రాంతంలో ఏర్పాటు చేసిన వినాయక చవితి మండపం వద్దకు వెళ్లాడు. మండపానికి విద్యుత్ అలంకరణ చేశారు. శుక్రవారం రాత్రి భారీ వర్షం కురవటంతో మండపానికి విద్యుత్ ప్రసరణ జరిగి పలువురికి విద్యుత్ షాక్ తగిలింది. అందరూ పక్కకు తప్పుకోగా లక్ష్మయ్య మండపానికి ఉన్న ఇనుప స్తంభాన్ని పట్టుకోవటంతో షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య నాగేశ్వరి, కుమారుడు శివ నవీన్ ఉన్నారు. ఎస్‌ఐ సోమేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కౌలు రైతులకు న్యాయం చేస్తాం

- కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్



దెబ్బతిన్న వరి పైరును పరిశీలిస్తున్న కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని, ఎమ్మెల్యే నరేంద్ర, కలెక్టర్ నాగలక్ష్మి

పెదకాకాని, సెప్టెంబరు 8: 'కౌలు రైతులకు న్యాయం చేస్తాం. ఈ క్రాప్ బుకింగ్ పూర్తికాని చోట్ల వారంలోగా పనులు పూర్తి కావాలి. రైతులను ఇబ్బంది పెడితే ఊరుకునేది లేదు' అని గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాలైన పెదకాకాని మండలం వెంకటకృష్ణాపురం, అనుమర్లపూడి, తంగెళ్ళమూడి, చేబ్రోలు మండలం శేకూరు, వీరనాయకునిపాలెం, తెనాలి రూరల్ మండలం హాఫ్‌పేట, కాజీపేట ప్రాంతాలలో పెమ్మసాని, ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మితో కలిసి ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా నీట మునిగిన పంట పొలాలను ఆయన పరిశీలించారు. రైతులతో మాట్లాడి పెట్టుబడి, నష్టం తదితర అంశాలను తెలుసుకున్నారు. ప్రస్తుత వరద కారణంగా ఖరీఫ్ సీజన్ మొత్తం వృథాగా పోయిందనీ, కొన్ని సీజన్లలో సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నామని పొన్నూరు నియోజకవర్గ రైతులు పెమ్మసానికి వివరించారు. కాగా గతంలో పనులు ప్రారంభమై ఆగిపోయిన లిఫ్ట్ ఇరిగేషన్‌తో పాటు మరో నూతన ఎత్తిపోతల పథకం ప్రతిపాదనాలపై ఇరిగేషన్, అగ్రికల్చర్ అధికారులతో రైతుల సమక్షంలోనే పెమ్మసాని మాట్లాడారు.

ఈ క్రాప్ బుకింగ్ చేయలేదు

జగన్ ప్రభుత్వంలో కేవలం వైసీపీ నాయకులకు చెందిన పంటలను మాత్రమే ఈ క్రాప్ బుకింగ్ చేశారని, స్థానికంగా కొన్ని వేల ఎకరాలను ఈ క్రాప్‌లోకి పొందుపరచలేదని పర్యటనలో భాగంగా పెమ్మసానికి పలువురు రైతులు విన్నవించారు. దీంతో కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమసాని, ధూళిపాళ్ల అధికారులను పిలిచి వారంలోగా ఈక్రాప్ బుకింగ్ మొత్తం పూర్తి చేయాలని ఆదేశించారు. జనసేన నియోజకవర్గ ఇన్చార్జి వడ్రాణం మార్కండేయ బాబు, వెంకటకృష్ణాపురం సర్పంచి ధూళిపాళ్ల వెంకటేశ్వరావు, ఎంపీటీసీలు మోపర్తి శ్రీనివాసరావు, టీడీపీ, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు సేవలు ప్రశంసనీయం

పెదకాకాని, సెప్టెంబరు 8: వరద సహాయక ప్రాంతాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. సీఎస్‌ఆర్ నిధుల కింద పెమ్మసాని నేతృత్వంలో ముందుకొచ్చిన ఇండస్ టవర్స్ లిమిటెడ్ సంస్థ, వరద ప్రభావిత ప్రాంతమైన పెదకాకాని సుందరయ్య కాలనీలో దుప్పట్లు, చీరలు, లుంగీలు, టవల్స్‌తో కూడిన ఒక్కో కిట్ చొప్పున 350 మందికి కేంద్ర సహాయ మంత్రి చంద్రశేఖర్, ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర, ఇండస్ టవర్స్ లిమిటెడ్ సీఈవో గంటా దిలీప్ కుమార్ చేతుల మీదుగా ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ వరద ప్రభావిత ప్రాంతాల్లో తాను 4-5 రోజులుగా పర్యటిస్తున్నానని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిద్రాహారాలు మాని మరీ ప్రజలకు అందుబాటులో ఉంటున్నారని వివరించారు. పార్టీ మండల అధ్యక్షులు వలివేటి మురళి, పార్టీ నాయకులు బోయపాటి రామ్మోహన్, పెండ్యాల నాగ సురేష్, సీపీఎం పొన్నూరు నియోజకవర్గ కార్యదర్శి నన్నపనేని శివాజీ, పార్టీ గ్రామ అధ్యక్షుడు కుక్కల మల్లికార్జునరావు, ఆత్మకూరు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తక్షణమే నష్టం అంచనా వేయండి

వట్టిచెరుకూరు, సెప్టెంబరు 8: వ్యవసాయాధికారులు పంట నష్టం అంచనాలను రూపొందించాలని గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఆదేశించారు. మండల పరిధిలోని కోవెలమూడి, ముట్లూరు, కారంపూడిపాడు, గ్రామాల ఆయకట్టు పరిధిలో వరద ముంపునకు గురై ఇప్పుడిప్పుడే బయట పడుతున్న వరి పైరును ఆదివారం స్థానిక ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులుతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ పెమ్మసాని మాట్లాడుతూ నష్ట పోయిన ప్రతి రైతును కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. కోవెలమూడి , కారంపూడి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక చవతి మండపాల్లో పాల్గొన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు మన్నవ పూర్ణచంద్రరరావు, ప్రత్తిపాడు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు నాగిశెట్టి నాగరాజు, జనసేన సమన్వయకర్త నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, శ్రీశైలం, వీరిశెట్టి సాంబయ్య, జగన్‌మోహన్‌రావు, ఉన్నవ నారాయణ, దేశం నాయకులు మురళి, సాంబశివరావు, రంగారావు, కృష్ణారావు, రైతులు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళాల వెల్లువ



సీఎం చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న డాక్టర్ ఎల్. కృష్ణ ప్రసాద్

సిబార్ డెంటల్ కాలేజీ..

పెదకాకాని, సెప్టెంబర్ 8: వరద బాధితులను ఆదుకునేందుకు గుంటూరు జిల్లా తక్కెళ్లపాడులోని సిబార్ డెంటల్ కళాశాల యాజమాన్యం ముందుకొచ్చింది. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలిసి కళాశాల తరపున రూ. 10 లక్షల ఆర్థిక సహాయాన్ని సీఎం రిలీఫ్ ఫండ్‌కు అందజేశారు. అదేవిధంగా కళాశాల తరఫున మరో రూ.50 వేలను హరే కృష్ణ సంస్థకు అన్నదాన నిమిత్తం అందజేశారు. రూ.2 లక్షల విలువగల నిత్యవసర సరకులను విజయవాడ వరద బాధితులకు అందజేశారు. వెయ్యి మంది పేదలకు అన్నదానాన్ని అందజేశారు. డాక్టర్ ఎల్. కృష్ణ ప్రసాద్ ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ కృష్ణమోహన్, ప్రిన్సిపల్ డాక్టర్ రమణారెడ్డి, డాక్టర్ నగేష్, డీసీఐ ఎగ్జిక్యూటివ్ మెంబర్ డాక్టర్ రేవతి పాల్గొన్నారు.



మంత్రి లోకేశ్‌కు చెక్కు అందజేస్తున్న కాటూరి వైద్య బృందం

కాటూరి వైద్యుల ఆధ్వర్యంలో...

ప్రత్తిపాడు, సెప్టెంబరు 8: మండల పరిధిలోని కోండ్రుపాడు వద్ద గల కాటూరి మెడికల్ కళాశాల ఆస్పత్రి వైద్యులు వరద బాధితుల సహాయార్థం రూ. 10 లక్షల విరాళాన్ని మంత్రి నారా లోకేశ్‌కు అందజేశారు. హాస్పిటల్ సూపరింటెండెంట్ చల్లా మోహనరావు, డీన్ డాక్టర్ వరప్రసాద్‌తోపాటు వైద్యుల బృందం లోకేష్‌ను కలిసి చెక్కును అందజేశారు. వరద సహాయక చర్యల్లో ప్రభుత్వం ముందున్నదని, ప్రభుత్వానికి తమ వంతు చేయూతగా డాక్టర్లందరి తరుపున ఈ సాయం అందజేస్తున్నట్లు వారు తెలిపారు.

కుడికాలువలో ఒకరు గల్లంతు

ముగ్గురిని కాపాడిన పోలీసులు



కుడికాలువలో గాలిస్తున్న గజ ఈతగాళ్లు

దుర్గి, సెప్టెంబరు 8: మండలంలోని అడిగొప్పుల శివారులోని నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి ఆలయంలో మొక్కులు తీర్చుకునేందుకు ఆదివారం బాపట్ల జిల్లా, చీరాల మండలం, గవిడివారిపాలెంకు చెందిన కొందరు గ్రామస్థులు వచ్చారు. వీరిలో మిందా బాలు, అతని తండ్రి వెంకటేశ్వర్లు, కొనకాని శ్రీనివాసరావు, అతని కుమారుడు లోహిత్ అడిగొప్పుల కుడి కాలువలో స్నానం చేసేందుకు దిగారు. కాలువ ఉధృతంగా ప్రవహిస్తుండడంతో వారు కొట్టుకుపోతుండగా వినాయక నిమజ్జనం నిమిత్తం కాలువ వద్ద కాపలా కాస్తున్న పోలీసు సిబ్బంది ఎస్‌ఐ సుధీర్ కుమార్‌కు సమాచారం అందించారు. అనంతరం తాళ్ల సహాయంతో పోలీసు సిబ్బంది మిందా వెంకటేశ్వర్లు, కొనకాని శ్రీనివాసరావు, లోహిత్‌లను కాలువ నుంచి బయటకు లాగారు. కాగా మిందా బాలు కాలువలో కొట్టుకుపోయాడు. ఎస్‌ఐ సుధీర్‌కుమార్ గజ ఈతగాళ్ల ద్వారా వెతికించినా బాలు ఆచూకీ లభ్యం కాలేదు. ఎస్‌ఐ సుధీర్‌కుమార్ కుడి కాలువ వద్ద అవాంచనీయ సంఘటనలు జరగకుండా సిబ్బందిని నియమించడం వలన ముగ్గురిని ప్రాణాలతో కాపాడగలిగారు.

వర్సిటీలో విదేశీ విద్యార్థి మృతి



మృతుడు రంగన్న

పెదకాకాని, సెప్టెంబరు 8: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో విదేశీ విద్యార్థి మృతి చెందిన సంఘటన ఆదివారం వెలుగు చూసింది. పెదకాకాని సీఐ నారాయణస్వామి తెలిపిన వివరాల మేరకు.. మయన్మార్ దేశానికి చెందిన రంగన్న(38) అనే విద్యార్థి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఎంఏలో బుద్ధిజం కోర్స్ చదువుతున్నాడు. గత రాత్రి మరో స్నేహితుడితో కలిసి విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఉన్న పుట్టల ప్రాంతంలో పుట్టగొడుగుల కోసం వెళ్లారు. అక్కడ పాము కాటు వేయటంతో గమనించిన స్నేహితుడు అతన్ని వైద్య చికిత్స నిమిత్తం మంగళగిరి ఎన్నారై ఆస్పత్రికి తరలించారు. అయితే రంగన్న అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించినట్లు పెదకాకాని పోలీసులు తెలిపారు. వర్సిటీ ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ ఇంచార్జి ఆచార్య పద్మావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

విద్యార్థి మృతి చెందడం బాధాకరం: మంత్రి నారా లోకేశ్

పాము కాటుకు విద్యార్థి మృతి చెందటం బాధాకరమని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సంతాపం వ్యక్తం చేశారు. ఈ సంఘటనపై ఆయన విచారం వ్యక్తం చేస్తూ ఇటువంటి సంఘటనలు వర్సిటీలో పునరావృతం కాకుండా అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఇళ్లలో చోరీల ముఠా అరెస్టు

- బంగారు, వెండి వస్తువులు స్వాధీనం

మేడికొండూరు సెప్టెంబరు 7: గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో వివిధ ప్రాంతాల్లో తాళాలు వేసిన ఇళ్లే టార్గెట్‌గా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న దొంగల ముఠాను మేడికొండూరు పోలీసులు శనివారం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి ఒక లక్ష 82 వేల రూపాయల విలువ గల బంగారు, వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. మేడికొండూరు సీఐ నాగూర్ మీరా సాహెబ్ కథనం ప్రకారం.. తెలంగాణ రాష్ట్రం మిర్యాలగూడెం మండలం గోగుల వారి గూడెంకు చెందిన నర్సింగ్ గంగాధర్, నర్సింగ్ మహేష్, పల్నాడు జిల్లా నరసరావుపేట టౌన్‌కు చెందిన చింత సాయికుమార్, బొలుకూరి హేమలింగేశ్వరరావు, జెట్టిపాటి కృష్ణ అనే ఐదుగురు ఏకమై చోరీలకు పాల్పడుతున్నారు. ఇళ్లకు తాళాలు వేసి ఉండటాన్ని గమనించి ఓ పథకం ప్రకారం ఇనుప రాడ్లు, గడ్డపారలు ఉపయోగించి తాళాలు తెరిచి ఇళ్లలోని నగదు, బంగారం, వెండి ఆభరణాలను దోచుకుంటారు. వీరు మేడికొండూరు మండలం కొర్రపాడు గ్రామంలో ఓ ఇంట్లో చోరీకి పాల్పడి సుమారు 339 గ్రాముల వెండి ఆభరణాలను దోచుకున్నారు. ప్రకాశం జిల్లా సంతమాగులూరు గ్రామంలో ఒక ఇంట్లో చోరీకి పాల్పడి 9 గ్రాముల వెండి, 16.5 గ్రాముల బంగారు ఆభరణాలను దోచుకున్నారు. నకరికల్లు మండలం కోంకలగుంట గ్రామంలో సుమారు 327 గ్రాముల వెండి వస్తువులు, 2 గ్రాముల బంగారపు వస్తువులు చోరీ చేశారు. వీరి వద్ద నుంచి మొత్తం 674 గ్రాముల వెండి, 18 గ్రాముల బంగారు వస్తువులతోపాటు చోరీలకు ఉపయోగించిన షిఫ్ట్ డిజైర్ కారు, రెండు ఇనుప రాడ్లు స్వాధీనం చేసుకున్నారు. శనివారం కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించారు. తుళ్లూరు డీఎస్పీ పి.మల్లికార్జునరావు, మేడికొండూరు సీఐ నాగూర్ మీరా సాహెబ్, ఎస్సై డేవిడ్ రాజు తదితరులు తమ సిబ్బందితో వారం రోజుల వ్యవధిలో ముఠాను అరెస్టు చేశారు. ముఠాను పట్టుకుని, వస్తువులను స్వాధీనం చేసుకున్న పోలీసులను జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ అభినందించారు.

కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంది



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, సెప్టెంబరు 8: పైర్లు నష్ట పోయిన రైతులు అధైర్య పడవద్దని, కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. నియోజకవర్గంలో వర్షాలకు దెబ్బతిన్న వరి పొలాలను ఆయన శనివారం పరిశీలించారు. చుండూరు మండలం తొట్టెంపూడి, మోదుకూరు, అమృతలూరు మండలం పెదపూడి, మోపర్రు, గోవాడ, పంచాళవరం, వేమూరు మండలంలోని పెరవలిపాలెం, పెరవలి, చావలి గ్రామాల్లో పర్యటించారు. దారులు సక్రమంగా లేని పొలాలకు ద్విచక్ర వాహనంపై వెళ్లిన ఆనందబాబును కలుసుకున్న రైతులు దెబ్బతిన్న పొలాలను చూపించి ఆవేదన వ్యక్తం చేశారు. నీరు కదలకుండా ఉన్న డ్రెయిన్‌లను ఆయన పరిశీలించారు. పంట నష్టం అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని అధికారులను ఫోన్ ద్వారా ఆదేశించారు. అనంతరం విలేఖర్ల సమావేశంలో మాట్లాడుతూ రైతులు అధైర్యపడవద్దని ప్రతి ఒక్క రైతును ఆదుకుంటామన్నారు. టీడీపీ, జనసేన పార్టీల శ్రేణులు పాల్గొన్నారు.

చోరీ కేసులో ఐదుగురు నిందితుల అరెస్టు

- రూ. 21 లక్షల సొత్తు రికవరీ



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జనార్దనరావు

పొన్నూరుటౌన్, సెప్టెంబరు 8: పొన్నూరు పట్టణంలో సంచలనంగా మారిన బంగారు దుకాణంలో చోరీ కేసులో ఐదుగురి నిందితులను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. తెనాలి డీఎస్పీ జనార్దనరావు తెలిపిన వివరాల మేరకు.. పొన్నూరు పట్టణానికి చెందిన అబ్దుల్ సలీం ధనలక్ష్మీ జ్యూలరీస్ పేరుతో వ్యాపారం నిర్వహిస్తున్నారు. ఈ నెల 4న అర్ధరాత్రి దుకాణంలో చోరీ జరిగింది. 24 కిలోల వెండి ఆభరణాలు పోయాయి. చోరీ సొత్తు విలువ రూ.20 లక్షలుగా ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసును ఒక రోజులోనే ఛేదించడమే కాకుండా చోరీ జరిగిన ఆభరణాలను స్వాధీనం చేసుకుని ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. సుమన్ కమతి, మిఠాలాల్ మాలి, ఉత్తమ్ సింగ్, విక్రమ్ దాస్ చరణ్ నలుగురు కలిసి ఈ నెల 1న విశాఖపట్నం వచ్చారు. అక్కడి నుంచి విజయవాడకు వచ్చారు. మిఠాలాల్ మాలి బెంగళూరుకు చెందిన పరశురామ్‌ను కారు అద్దెకు తీసుకుని బెంగళూరుకి చెందిన అషుసింగ్, అజూ అనే వార్లను కూడా తీసుకు రమ్మని కబురు పంపారు. బెంగళూరు నుంచి టయోటా ఫార్చ్యూనర్ వాహనంలో ఈ నెల 4న విజయవాడ రాగా అందరూ కలిసి సాయంత్రం 4 గంటలకు పొన్నూరు వచ్చారు. పథకం ప్రకారం పట్టణంలోని తోటమ్మ తల్లి ఆలయం సమీపంలోని బంగారు దుకాణంలో చోరీకి పాల్పడ్డారు. సుమన్ కమతి, ఉత్తమ్ సింగ్, విక్రమ్ దాస్ చరణ్ షాపులోకి ప్రవేశించి వెండి వస్తువులు తీసుకొచ్చి కారులో పెడుతుండగా స్థానిక యువకులు గమనించి పట్టుకోవటానికి ప్రయత్నించగా, కారులో ఉన్న మిఠాలాల్ మాలిక్, పరశురామ్ సొమ్ముతో సహా పరారైయ్యారు. సుమన్ కమతి, ఉత్తమ్ సింగ్, విక్రమ్ దాస్ చరణ్‌లు వాహనం ఎక్కలేకపోవడంతో విడిగా పరారైయ్యారు. వీరిని సీఐ రవికిరణ్ రైల్వే స్టేషన్‌లో అదుపులోకి తీసుకున్నారు. 6వ తేదీ ఉదయం చిత్తూరు జిల్లా చంద్రగిరి సమీపంలోని దాదంకి టోల్‌ప్లాజా వద్ద మిఠాలాల్ మాలిక్, పరశురామ్‌లను చోరీ సొత్తు, కారుతోసహా అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో అషుసింగ్, అజూ పరారీలో ఉన్నారు. ఈ ముద్దాయిలపై పలు పోలీస్టేషన్లలో చోరీ కేసులు నమోదైనట్లు డీఎస్పీ బి.జనార్దనరావు తెలిపారు. సమావేశంలో సీఐ కె.రవి కిరణ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు పవర్ లిఫ్టర్ల ఎంపిక



ఎంపికైన పవర్ లిఫ్టర్లతో అసోసియేషన్ ప్రతినిధులు

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 8: అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో ఈ నెల 14, 15 తేదీల్లో జరుగనున్న 11వ ఏపీ స్టేట్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్, బెంచిప్రెస్ పోటీలకు గుంటూరు జిల్లా జట్టును ఎంపిక చేసినట్టు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్మాకుల విజయభాస్కరరావు, షేక్ సందాని తెలిపారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, మాస్టర్స్ విభాగాల్లో జరిగే ఈ పోటీలకు జిల్లా నుంచి 30 మంది మహిళా లిఫ్టర్లు, 40 మంది పురుష లిఫ్టర్లు ఎంపికైనట్టు ప్రకటించారు. రాష్ట్ర పోటీలకు ఎంపికైన లిఫ్టర్లకు అసోసియేషన్ వైస్‌ఛైర్మన్ ఆర్ఎన్ వంశీకృష్ణ, కోశాధికారి గుమ్మడి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు బి.ప్రసాద్, పి.భాస్కరరావు, బొల్లినేని చంద్రిక, సంయుక్త కార్యదర్శులు ఘట్టమనేని సాయిరేవతి, ఎండీ మస్తాన్‌వలి, వలపర్ల శ్రీనాథ్, కార్యవర్గ సభ్యులు అభినందనలు తెలియజేశారు

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.20
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	114, 122,133
చికెన్ విత్ స్కిన్	216.00
చికెన్ స్కిన్ లెస్	226.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

వినాయక చవితి ఉత్సవాలలో ఎంపీ తెన్నేటి పూజలు



వినాయకునికి పూజలు చేస్తున్న ఎంపీ కృష్ణప్రసాద్ తదితరులు

బాపట్ల, సెప్టెంబరు 8 : వినాయక చవితి ఉత్సవాలలో ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఆయన నివాసంలో వినాయకునికి పండితులతో కలిసి శాస్త్రోక్తంగా పూజలు జరిపారు. అనంతరం అక్బర్‌పేటలో ఉత్సవకమిటీవారు ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. గణనాధుని ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చవితి ఉత్సవాలలో అన్నప్రసాద వితరణ



భక్తులకు అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

పట్టణంలోని వివేకానంద కాలనీ రోడ్డులో అడితీల సెంటర్‌లో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వినాయక మండపాన్ని ఎమ్మె ల్యే వేగేశన నరేంద్రవర్మ సందర్శించి పూజా కార్యక్రమాలు నిర్వహించి అన్నదాన కార్యక్రమంలో భక్తులకు వడ్డించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు బుర్లె రామసుబ్బారావు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరునికి ఎస్పీ దంపతుల పూజలు



వినాయకచవితి పూజలు చేస్తున్న ఎస్పీ తుషార్ డూడి దంపతులు

స్థానిక ఏఆర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వినాయకచవితి ఉత్సవాలలో భాగంగా శనివారం నిర్వహించిన పూజా కార్యక్రమాలలో ఎస్పీ తుషార్ డూడి దంపతులు కుటుంబ సమేతంగా పాల్గొని పూజలు నిర్వహించారు. జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బంది కుటుంబ సభ్యులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎస్పీ మాట్లాడుతూ పండుగను కుటుంబ వాతావరణంలో జరుపుకోవటం ద్వారా పోలీసు సిబ్బంది మధ్య స్నేహభావం, ఐక్యత పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టిపి విఠలేశ్వర్, ఏఆర్ డీఎస్పీ ఎస్.చంద్రమోహన్, ఆర్ఐలు మౌలుద్దీన్, శ్రీనివాసరెడ్డి, పోలీసు అధికారులు, సిబ్బంది వారు కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొని వినాయకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

పూజల్లో పాల్గొన్న అన్నం సతీష్ ప్రభాకర్



వినాయకుని విగ్రహానికి హారతిస్తున్న అన్నం సతీష్ ప్రభాకర్

కర్లపాలెం, సెప్టెంబరు 8 : కర్లపాలెం మండలంలోని 20 పంచాయతీలలో గ్రామగ్రామాన వినాయక చవితి వేడుకలను శనివారం భక్తులు ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాలలోని యువకులు, భక్తులు పోటీలు పడి భారీ వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. దమ్మనపాలెంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ పాల్గొని స్వామి వారికి పూజలు నిర్వహించారు.

మండలంలోని గణపవరం పంచాయతీ పరిధిలో వినాయక పర్వదినం సందర్భంగా కాపుకమిటీ ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద ఎమ్మెల్యే నరేంద్ర వర్మ పూజలు చేసి ఆదివారం అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. నల్లమోతు వారిపాలెంలో శ్రీపెద్దింటమ్మ అమ్మవారి కొలుపులు సందర్భంగా అమ్మవారికి నరేంద్రవర్మ ప్రత్యేక పూజలు చేసి అన్నసంతర్పణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నరేంద్రవర్మకు టీడీపీ నాయకులు మాడా శ్రీనివాసరావు, మునీపల్లి చిన్న, బీసాబత్తిన గోపిలు దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నక్కల వెంకటస్వామి, పున్నయ్య, సూరినేని మురళి, ఏపూరి భూపతిరావు, చింతాయపాలెం సర్పంచ్ పీటా శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు ఏపూరి భూపతిరావు, బుల్లియ్య, కుంటా పవన్, కుంటా సూరయ్య, జనసేన నాయకులు గొట్టిపాటి శ్రీకృష్ణ, చిలకల సురేంద్రబాబు, గోల్డ్ ప్రసాద్ పాల్గొన్నారు.



వినాయక పూజలో పాల్గొన్న అనగాని శివప్రసాద్

● రేపల్లె, సెప్టెంబరు 8: నియోజకవర్గంలోని రేపల్లె, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లిలో చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో శనివారం నిర్వహిచారు. పట్టణంలోని చవితి వేడుకల్లో మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ పాల్గొని ప్రత్యేక పూజ లు నిర్వహించి 50 పందిళ్ళల్లో ఒక్కో పందిరికి రూ.11వేలు చొప్పున కమిటీ వారికి నగదును అందించారు. టీడీపీ నాయకుడు పంతాని మురళీధరరావు, దండుప్రోలు వెంకటేశ్వరరావు, పిచ్చియ్య, తాతా ఏడు కొండలు తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని పలు పందిళ్ళలో జనసేన పార్టీ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ కమతం సాంబశివరావు పాల్గొని పూజలు నిర్వహించారు.

● వేమూరు, సెప్టెంబరు 8 : మండల పరిధి గ్రామాల్లోని ప్రజలు భక్తి ప్రపత్తులతో వినాయక చవితి వేడుకలను ప్రారంభించారు. వేమూరులో కమ్మజనసేవా సమితి నిర్వహిస్తున్న ఉత్సవాల్లో తలశిల గంగాధరరావు దంపతులు గణపతి భారీ విగ్రహాన్ని ఎన్టీఆర్ పుర వేదికపై ప్రతిష్ఠింపజేసి ప్రత్యేక పూజలు జరిపారు. సిద్ధిబుద్ధి సమేత లక్ష్మీగణపతి ఆలయంలో 11 రోజుల దీక్షా ఉత్సవాలను ప్రారంభించారు. జంపని సిద్ధి వినాయక ఆలయంలో నిత్య పంచామృతాభిషేకాలు విశేష పూజలు ప్రారంభించారు. రత్నగర్భ గణపతి ఆలయంలో ఐదు రోజుల దీక్షతో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. చావలి, పెనుమర్రు, పెరవలి, చదలవాడ తదితర గ్రామాల్లో గణపతి ఉత్సవాలను నిర్వాహక కమిటీ సభ్యులు నిర్వహిస్తున్నారు.

● అమృతలూరు, సెప్టెంబరు 8 : మండల పరిధిలోని పలు గ్రామాల్లో మండపా ల్లో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. అమృతలూ రులో శివా టెంపుల్ యూత్ ఆధ్వర్యంలో శ్రీవిఘ్నేశ్వరస్వామికి కల్యాణం నిర్వ హించారు. ఆదివారం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం సిద్ధి, బుద్ధి సమేత శ్రీవిఘ్నేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలకు రథంపై గ్రామోత్సవం జరిపారు. పలు గ్రామాల్లో కనక తప్పెట్లు, డీజేలతో నిమజ్జనం నిర్వహించారు.



బాలినేని మాధవి మెమోరియల్ చారిటబుల్‌ట్రస్ట్ తరపున రూ.2లక్షల చెక్కును ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మలకు అందజేస్తున్న నిర్వాహకురాలు

వరద బాధితులకు విరాళాలు

● దాతలకు ఎంపీ, ఎమ్మెల్యే అభినందనలు

బాపట్ల, సెప్టెంబరు 8 : వరద బాధితులకు తమవంతు సాయంగా బాలినేని మాధవిచౌదరి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ వారు రూ.2 లక్షలు అందజేశారు. అదేవిధంగా వివేకానందకాలనీవాసులు బాధితుల సహాయార్థం ఆర్థిక సహకారం అందజేశారు. కాలనీలోని బాలినేని మాధవి చౌదరి భవనంలో ఆదివారం ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మలకు ట్రస్ట్ తరుపున రూ.2 లక్షల చెక్కును అందజేశారు. అదేవిధంగా టి.రాజకుమారి రూ.50 వేలు, ఎల్.శివ రామకృష్ణ రూ.50 వేల చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే, ఎంపీ మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు దాతలు ముందుకు రావటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు ఎస్.గోపీచంద్, ఉపాధ్యక్షుడు జి.ఉమామహేశ్వరరావు, కార్యదర్శి డాక్టర్ ఎస్.ఆర్.కె.మూర్తి, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పొలాల్లో తగ్గని నీరు

● తీరంలో 13 వేల ఎకరాలు నీటమునక
● నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులు
● చర్యలు తీసుకోవాలని కోరుతున్న రైతులు

రేపల్లె, చెరుకుపల్లి, సెప్టెంబరు 8 : రేపల్లె నియోజకవర్గంలోని చెరుకుపల్లి, గూడవల్లి, కనగాల, పాంచాలవరం, వేమూరు నియోజకవర్గంలోని భట్టిప్రోలు, చావలి, పెరవలి, అమర్తలూరు గ్రామాల్లో పదిరోజుల క్రిందట కురిసిన వర్షపునీరు వరిపంట పొలాల్లో తిష్టవేసి ఉన్నాయి. డ్రెయినేజీ అధికారులు దృష్టి సారించకపోవటంతో సుమారు రెండు నియోజకవర్గాల్లో 13 వేల ఎకరాలుపైనే నీటిలోనే నానుతున్నాయి. వరి నాట్లు వేసిన పంట పొలం అంతా నడుములోతు నీళ్ళలో ఉండటంతో పంట అంతా వర్షార్పణం అయిందంటూ రైతులు బోరున విలపిస్తున్నారు. ఎకరాకు రూ.10 వేలు పెట్టుబడి పెట్టి నాట్లు వేశామని, పది రోజులు నీటిలో ఉండిపోయి నారంతా చీకిపోయి పంట పొలం పనికి వచ్చే పరిస్థితి లేదు. జలవనరులశాఖ, డ్రెయినేజీ, వ్యవసాయ అదికారులకు పలుమార్లు తమ గోడు విన్నవించుకున్న పట్టించుకున్న దాఖలాలు లేవని రైతులు ఆరోపిస్తున్నారు.

పొలాలను పరిశీలించిన శివప్రసాద్

వరద ముంపుతో పంట నష్టపోయిన ప్రతి రైతు న్యాయం జరిగేలా చూస్తామని మంత్రి సత్యప్రసాద్ సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. చెరుకుపల్లి మండలం గూడవల్లి గ్రామంలో నీటిలో నానుతున్న వరిపొలాలను ఆదివారం ఆయన రైతులతో కలిసి పరిశీలించారు. నిజాంపట్నం వద్ద పాలరేవు వంతెన షట్టర్లను తొలగించి ఆర్ఎం డ్రెయిన్ వరదనీరు సముద్రంలో వేగంగా కలిచేలా చర్యలు తీసకుంటామన్నారు. తమ పొలాల్లో పంట మునిగిందని వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించలేదని కొందరు రైతులు ఆయన దృష్టికి తీసుకురాగా సిబ్బంది కొరత ఉందని ఏవో టి.బాలాజీ గంగాధర్ ఆయనకు వివరించారు. దీనిపై స్పందించిన శివప్రసాద్ రేపల్లె ఏడీ హంస్సేన్‌తో మాట్లాడి డివిజన్‌లోని ఇతర మండలాల సిబ్బందిని చెరుకుపల్లి మండలానికి పంపించాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోగినేని సీతారామయ్య, మేకా మహేష్, రాఘవేంద్రరావు, నలిగిలి నాగేశ్వరరావు, పిచ్చియ్య, కోటా వెంకటరమణ, బాల కోటేశ్వరరావు, గోగినేని వసుధ, గోగినేని రామాంజనేయులు, కొడాలి తల్పసాయి, రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



గూడవల్లి సమీపంలో నీటమునిగిన పొలాలను పరిశీలిస్తున్న శివప్రసాద్, వ్యవసాయ, డ్రెయినేజీ అధికారులు, రైతులు

వేలాది రూపాయలు నష్టపోయాం



ఖరీఫ్ సీజన్‌లో ఎకరాకు రూ.15 నుంచి రూ.20 వేలు పెట్టుబడులు పెట్టి వరి నాట్లు వేశాం. వరద కారణంగా పైరు పూర్తిగా మునిగి కుళ్ళిపోతుంది. 12ఎకరాల్లో వరిసాగు చేసి నష్టపోయాను. ఆర్ఎండ్రెయిన్ నీరు ఎగువకు పారడంతో పొలాల్లో నీరు నిలిచింది. దీంతో వేలాది రూపాయలు నష్టపోయాం.

- మేకా మహేష్, రైతు,గూడవల్లి.

ప్రభుత్వం ఆదుకోవాలి



ఈఏడాది 10 ఎకరాల్లో కూలీలతో వరి నాట్లు వేయించాను. అన్ని ఖర్చులు కలిపి రూ.4.5 లక్షలు పెట్టుబడి పెట్టాను. వరిమొక్క దుబ్బుచేసే సమయంలో వరదనీరు ముంచెత్తింది. పైరు పూర్తిగా దెబ్బతిని నష్టం వాటిల్లింది. ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలి.

- గోగినేని సీతారామయ్య రైతు, గూడవల్లి

కృష్ణానదికి పెరిగిన వరద ప్రవాహం

● వరదకు తుడిచిపెట్టుకుపోయిన వాణిజ్య పంటలు
● లక్షలాది రూపాయల నష్టం



పూర్తిగా దెబ్బతిన్న కంద పైరు

కొల్లూరు, సెప్టెంబరు 8 : కృష్ణానదికి వరద ప్రవాహం పోటెత్తుతోంది. ఎగువ నదీ పరివాహక ప్రాంతంలో కురిసిన భారీ వర్షాల వల్ల ప్రకాశం బ్యారేజీకి వరద పోటెత్తడంతో ఆదివారం సాయంత్రానికి 5.5 లక్షల క్యూసెక్కుల పైచిలుకు నీటిని దిగువకు విడుదల చేశారు. దీంతో కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లోని లంక గ్రామాలు మళ్లీ వరద గుప్పెట్లో చిక్కుకోనున్నాయి. కలెక్టర్ వెంకటమురళీ ఆదేశాలతో అధికార యంత్రాంగం అప్రమత్తమై వరద హెచ్చరికలతో లంక గ్రామాల్లోని ప్రజలు పునరావాస కేంద్రాలకు తరలి రావాలని మైకుల ద్వారా ప్రచారం చేశారు. ఇప్పటికే చిలుమూరు, కొల్లూరు, దోనేపూడి, భట్టిప్రోలు మండలంలోని వెల్లటూరు, ఓలేరు వద్ద ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో ప్రభుత్వ సిబ్బంది వరద విధుల్లో పాల్గొంటున్నారు. పునరావాస కేంద్రాలకు వచ్చే వారికి సహాయ చర్యలు చేసేందుకు అన్ని సిద్ధం చేస్తున్నారని చెప్పారు.

ఈ నెల 1వ తేదీన కృష్ణానదికి పోటెత్తిన భారీ వరదతో కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లోని 22 లంక గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న వాణిజ్య పంటలు తుడిచిపెట్టుకుపోయాయి. వరద తగ్గినప్పటికీ పంటల్లో ఉన్న వరద నీరు బయటకు వెళ్లకపోవడంతో కంద, పసుపు, అరటి, బొప్పాయి, తమలపాకు, కూరగాయల పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వాణిజ్య పంటలు అయితే రోజుకో విధంగా రూపురేఖలు కోల్పోయి కుళ్లిపోతున్నాయి. వాటిని చూసుకున్న రైతన్నలు లక్షలాది రూపాయల పెట్టుబడులు కృష్ణార్పణం అయ్యాయని వాపోతున్నారు. భారీ వరదతో అన్ని కోల్పోయినా ఇంకా కృష్ణమ్మ తమను కనికరించడం లేదంటూ ఆవేదన చెందుతున్నారు.

కృష్ణానదికి వరద పోటు

రేపల్లె, సెప్టెంబరు 8:కృష్ణానదికి భారీ వరద నీరు చేరటంతో ప్రకాశంబ్యారేజీ వద్ద అన్ని గేట్లు ఎత్తివేసి దిగువకు వరద నీరు వదలటంతో పెనుమూడికి వరదపోటు రానున్నదని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆదివారం మండలంలోని పెనుమూడి పుష్కరఘాట్‌వద్ద వరద ఉధృతిని డీఎస్పీ మురళీకృష్ణ, తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావు, మంత్రి సోదరుడు శివప్రసాద్‌లు పరిశీలించారు. కృష్ణాకరకట్ట వెంట ఉన్న గ్రామాలలోని ప్రజలను రెవెన్యూశాఖ అప్రమత్తం చేసింది. పల్లెపాలెం వాసులను పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు. అర్ధరాత్రికి వరద మరింత పెరిగే పరిస్థితి ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ అధికారులు కోరారు.

వరద బాధితులకు బియ్యం పంపిణీ



బియ్యం లారీకి జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

● కర్లపాలెం, సెప్టెంబరు 8 : కర్లపాలెం మండల సమైక్య వీవోఏల ఆధ్వర్యంలో మండల సమైక్య బ్యాంక్ వారి సహకారంతో కొల్లూరు, భట్టిప్రోలు వరద బాధితుల సహాయార్థం బియ్యం పంపిణి లారీని ఏర్పాటు చేయగా ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఆదివారం పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఏపీఎం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కలెక్టర్ వెంకటమురళి, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ సూచనల మేరకు రావిఅనంతవరంలోని 60 ఎస్సీ కుటుంబాలకు, పల్లెపాలెంలోని 127 బీసీ పల్లెకారు కుటుంబాలకు లక్షా 12 వేల 500 విలువ చేసే బియ్యాన్ని పంపిణికి ఏర్పాటు చేశామన్నారు. యూనియన్‌బ్యాంక్, చైతన్య గోదావరి బ్యాంక్, ఇండియన్ బ్యాంక్ సిబ్బంది 1870 కేజీల బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్లు మురళికృష్ణ, రత్నజ్యోతి, మానసా, బాపట్ల ఏరియా కోఆర్డినేటర్ ఉసురుపాటి సుబ్బారావు, జడ్పీటీసీ వేణుగోపాలరెడ్డి, పార్లమెంట్ ఉపాధ్యక్షుడు నక్కల వెంకటస్వామి, టీడీపీ మండల అధ్యక్షుడు ఏపూరి భూపతిరావు, కర్లపాలెం కన్వీనర్ షేక్ బాజి, ఉపసర్పంచ్ పఠాన్ అహ్మద్‌బాషా, వీవోఏలు శివపార్వతి, మార్తమ్మ, మంజుల, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

● విజయవాడ ముత్యాలపాడులోని గొట్టిముక్కల సూర్యనారాయణ రాజు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో పునరావాసం ఉంటున్న రామకృష్ణాపురం, మద్దికట్ట, దేవినగర్, సింగ్‌నగర్‌కు చెందిన వరద బాధితులు 300 మందికి కర్లపాలెం మండలం మాజీ కోఆప్షన్ సభ్యులు షేక్ బాషా మిత్ర బృందం ఆహారం పంపిణీ చేశారు. బాషా మిత్ర బృందాన్ని కార్పొరేటర్ శిరీషా, పెనుమెత్స సత్యనారాయణరాజు అభినందించారు. కార్యక్రమంలో మాజీ కో ఆప్షన్ సభ్యులు షేక్.బాషా, మాజీ జడ్పీటీసీ గుంపుల కన్నయ్య, పఠాన్ అంకుషా, షేక్.మహబూబ్ సుభానీ, షేక్ కలాం, షేక్ జిలానీ, కాలేషా, కమల్‌బాషా, బిలాల్, షేక్ ఇబ్రహీం, పిచ్చయ్య, బాజి పాల్గొన్నారు.

● బాపట్ల, సెప్టెంబరు 8 : టీడీపీ మహిళా నాయకురాలు దగ్గుమల్లి రాణి ఆధ్వర్యంలో విజయవాడలోని 56వ డివిజన్‌లో ముంపు నకు గురైన బాధితులకు ఆహార ప్యాకెట్‌లు పంపిణీ చేశారు. ఆహారంతో పాటు వాటర్ బాటిల్స్ అందజేసి అక్కడ బాధితుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

● పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 8 : వరద బాధితుల సహాయార్థం పిట్టలవానిపాలెం కేర్ యోగా నేచరోపతి, మెడికల్ కళాశాల ఫౌండర్ వేగేశన రాధాకృష్ణంరాజు సహకారంతో కొల్లూరు, భట్టిప్రోలు మండల వరదబాధిత కుటుంబాలకు ఆదివారం కలెక్టర్ జె.వెంకటమురళి, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఆధ్వర్యంలో 25 టన్నుల నిత్యావసర సరకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వేగేశన కిషోర్‌రాజు, ప్రిన్సిపాల్, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

● మండలంలోని చందోలు గ్రామపంచాయతీకి చెందిన సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు మాజీ సభ్యులు, టీడీపీ నాయకుడు ఎస్.మోసిన్ నియాజి ఆధ్వర్యంలో విజయవాడ 64వ డివిజన్‌లోని వరద బాధిత కుటుంబాలకు ఆహారపొట్లాలు మంచినీరు, పండ్లను పంపిణి చేశారు. కార్యక్రమంలో బాపట్ల పార్లమెంట్ టీడీపీ బీసీ సెల్ కార్యదర్శి పమిడి రవీంద్ర, నియోజకవర్గ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి కె.కిషోర్ రెడ్డి, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి మోదుగుల శంకర్‌రెడ్డి, ముస్లిం ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు మౌలాబేగ్, టీడీపీ నాయకులు ధరియా పాల్గొన్నారు.

● కొల్లూరు, సెప్టెంబరు 8 : కృష్ణానదికి వచ్చిన వరదల వల్ల సర్వం కోల్పోయిన లంక గ్రామాల ప్రజలకు తెనాలి మానవతా స్వచ్ఛంద సంస్థ నిత్యావసరాలు పంపిణీ చేసింది. లంక గ్రామాల్లో సంస్థ సభ్యులు, ఛైర్మన్ కొలసాని రాంచంద్, ప్రెసిడెంట్ ఓంకార ప్రసాద్ పర్యటించి నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈపూరులంక, అన్నవరపులంక, చిలుమూరులంక, చింతల్లంక, ఆవులవారిపాలెం, తురకపాలెం తదితర గ్రామాల్లో పర్యటించి ఆవులవారిపాలెం గ్రామ పంచాయతీ ఆవరణలో 450 మంది బాధిత కుటుంబాలకు, ఒక్కో కుటుంబానికి రూ.600 విలువైన నిత్యావసరాలను అందజేశారు.

● కొల్లూరు, సెప్టెంబరు 8 : కొల్లూరు ఎంప్లాయిస్ రిక్రియేషన్ క్లబ్ వద్ద రోటరీ అపద్బాంధు ప్రాజెక్టులో భాగంగా ఆదివారం రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ శరత్ చౌదరి ఆదేశాలతో రోటరీ క్లబ్ ఆఫ్ పిడుగురాళ్ళ, తెనాలి రోటరీ క్లబ్ వారి సహకారంతో వరద ప్రభావిత ప్రాంతాల్లోని 2500 కుటుంబాలకు రూ.25 లక్షలతో నిత్యావసర సరుకుల పంపిణీలో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పాల్గొన్నారు. వరద ముంపు గ్రామాల్లో పర్యటిస్తున్న కలెక్టర్ ఈపూరులంక వద్ద రోటరీ క్లబ్ ప్రతినిధులు ఆయన చేతుల మీదుగా బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయించారు. కార్యక్రమంలో రోటరీ 3150 గవర్నర్ ఎం.రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులందరూ కలిసి వరద ప్రభావిత ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. పోతార్లంక, గాజుల్లంకలోని విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు, బ్యాగ్‌లు, పెన్సిల్స్, జామెంట్రీ బాక్సులు, పలకలు పంపిణీ రాష్ట్ర అధ్యక్షుడు గుర్రం మురళి చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో జి.సుబ్బారావు, కుటుంబరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● చుండూరు, సెప్టెంబరు 8 : మండలంలో వరద ముంపు వల్ల దెబ్బతిన్న బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న నిత్యావసర సరుకులను యడ్లపల్లి పంచాయతీ కార్యాలయంలో ఆదివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బాపట్ల పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షుడు తమ్మా శివారెడ్డి, డిఎస్‌ఓ విలియన్స్, డీటీ శ్రీనివాస్, వసంతరావు, ముక్కాముల వేణు, అలపర్తి శ్రీనివాస్, జాని, గుమ్మడి శ్రీనివాసరావు, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● రేపల్లె,సెప్టెంబరు 8 : పెనుమూడి పల్లెపాలెం బాధితులకు ఆదివారం దుప్పట్లను పంపిణీ చేశారు. అర్బన్ గౌడ సంఘం ఆధ్వర్యంలో వరద ప్రభావిత ప్రాంతమైన పెనుమూడి పల్లెపాలెంలో 300 కుటుంబాలకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంతాని మురళీధరరావు, కోటేశ్వరరావు, దాసరి వెంకట్రావు, చెన్ను శ్రీనివాసరావు, పామర్తి సాంబశివరావు, జాలార్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని పెనుమూడి పల్లెపాలెం వరద బాధితులకు ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ సహకారంతో 147కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి 10 కిలోల చొప్పున బియ్యాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అనగాని శివప్రసాద్, పంతాని మురళీధరరావు, ఏపీఎం శ్రీనివాస్‌రెడ్డి, స్పెషలాఫీసర్ నాయక్, తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● మండలంలోని బొబ్బర్లంక గ్రామంలో వరద బాధితులకు ఆదివారం పంచాయతీ కార్యాలయం వద్ద 50 కుటుంబాలకు నిత్యావసర వస్తువులు, దుప్పట్లను పట్టణ ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు కాశేపల్లి ఈశ్వరబాబు, సుగ్గుల సుదర్శన్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కుదరవల్లి వెంకటేశ్వరరావు, కోశాధికారి తూనుగుంట్ల రాజేష్, ఉపాధ్యక్షులు పి.మల్లికార్జున్‌రావు, వెంకటరామకృష్ణ, శ్రీనివాసరావు, యెండూరు శివరామకృష్ణ, మల్లికార్జునరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అనసూయమ్మకు ఆర్థిక సాయం

కర్లపాలెం, సెప్టెంబరు 8 : కర్లపాలెం మండలం గణపవరం గ్రామానికి చెందిన యాతం అనసూయమ్మకు కాపు సంఘం తరుపున ఆదివారం సంఘ అధ్యక్షుడు ఇక్కుర్తి శ్రీనివాసరావు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో శనివారపు బసవయ్య, అంకిరెడ్డి రవి, తోట అంకమ్మరావు, అంకిరెడ్డి దానరావు, దానయ్య, గొట్టిపాటి శ్రీకృష్ణ, మాడసాని బాలాజి, చెరుకూరి ఉదయచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



ఆవులవారిపాలెం చర్చిలో గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● లంక గ్రామాల్లో ఎమ్మెల్యే ఆనందబాబు పర్యటన

కొల్లూరు, సెప్టెంబరు 8 : కృష్ణానదికి మళ్లీ వరద ముప్పు పొంచి ఉందని లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు సూచించారు. ఆదివారం మండల పరిధిలోని ఆవులవారిపాలెంలో ఆయన పర్యటించి వరద వల్ల నిర్వాసితులైన ప్రజలతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు వరదకు తమ ఇళ్లన్నీ నీట మునిగి వస్తువులు కొట్టుకుపోగా కొన్ని వస్తువులు పనికి రాకుండా పోయాయని, సర్వస్వం కోల్పోయామంటూ ఎమ్మెల్యే వద్ద వాపోయారు. ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని ఆయన వారికి భరోసా ఇచ్చారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూదన ప్రసాద్, సంగం డెయిరీ డైరెక్టర్ భగవాన్, సుంకర రామమోహనబాబు, టీడీపీ, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటాం

అమృతలూరు, సెప్టెంబరు 8 : అధిక వర్షాల కారణంగా పంట దెబ్బతిన్న ప్రతి రైతును ఆదుకుంటామని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. మండల పరిధిలోని మోపర్రు, గోవాడ, పాంచాళవరం, మూల్పూరు గ్రామాల్లో ముంపులో ఉన్న పంట పొలాలను ఆయన పరిశీలించారు. గత ప్రభుత్వం డ్రెయిన్‌లను పట్టించుకోకపోవడం వల్ల నేడు పంట పొలాలు నీట మునిగాయన్నారు. మండల వ్యవసాయశాఖ అధికారితో మాట్లాడారు. క్షేత్ర స్థాయిలో పంట దెబ్బతిన్న ప్రతి రైతును గుర్తించి పంట నష్టం నమోదు చేయించాలని సూచించారు. ఆయన వెంట పాంచాళవరం సర్పంచ్ పి.హేమచంద్, శ్రీనివాసరావు, జి.వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, ఎం.రమేష్ ఉన్నారు.



రవాణా సౌకర్యాలపై కలెక్టర్‌కు వివరిస్తున్న లంక గ్రామాల ప్రజలు

ప్రజలు పునరావాస కేంద్రాలకు తరలిరావాలి : కలెక్టర్

కొల్లూరు, సెప్టెంబరు 8 : కృష్ణానదికి మళ్లీ వరద ముంపు పొంచి ఉండటంతో లంక గ్రామాల ప్రజలు పునరావాస కేంద్రాలకు తరలిరావాలని కలెక్టర్ జె.వెంకటమురళి సూచించారు. కొల్లూరు మండల పరిధిలోని లంక గ్రామాల్లో ఆదివారం ఆయన జేసీ ప్రఖర్‌జైన్, ఆర్డీవో హేలాషారోన్‌లతో కలిసి పర్యటించారు. అరవింద వారధి వద్ద ప్రవాహాన్ని పరిశీలించారు. అనంతరం సుగ్గున లంక చప్టా వద్దకు వెళ్లి అక్కడ 6 లక్షల క్యూసెక్కుల వరద నీరు వస్తే రాకపోకలు ఉంటాయా అని ఆ గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ హైలెవల్ వంతెన నిర్మాణం చేయిస్తే రాకపోకలకు వరదల సమయంలో ఆటంకం ఉండదని చెప్పడంతో గతంలో ఏమైనా అంచనాలు వేశారా అని ప్రశ్నించగా, వరదల సమయంలో మాత్రమే వంతెన నిర్మాణం చేస్తామని చెప్పడం మినహా ఎటువంటి అంచనాలు వేయలేదని కలెక్టర్‌కు చెప్పారు. ఆర్ అండ్ బీ అధికారులతో హైలెవల్ వంతెన నిర్మాణానికి అంచనాలు వేయిస్తామని కలెక్టర్ గ్రామస్తులకు తెలిపారు. అనంతరం తిరిగి కొల్లూరుకు వస్తుండగా కరకట్ట దిగువున పెసర్లంక గ్రామస్తులు కరకట్ట నుంచి ఆవులవారిపాలెం వరకు రోడ్డును మెరక చేస్తే లంక గ్రామాలకు వరదల సమయంలో రవాణా సౌకర్యాలు మెరుగవుతాయని వివరించారు. ఆయన ఆ శాఖాధికారులతో చర్చిస్తామని అన్నారు.

అధికారులతో కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్

కొల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా, మండల స్థాయి అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కృష్ణానదికి వరద ప్రవాహం 5.5 లక్షల క్యూసెక్కులతో చేరుకోవడంతో రెండవ ప్రమాద హెచ్చరికను జారీ చేసినట్లు ప్రకటించారు. కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి సత్తిబాబు, జిల్లా, మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగుల సేవలు అభినందనీయం

బాపట్ల, సెప్టెంబరు 8 : వరద బాధితులకు రెవెన్యూ ఉద్యోగులు అందిస్తున్న సేవలు అభినందనీయమని కలెక్టర్ జె.వెంకటమురళి అన్నారు. జిల్లా రెవెన్యూ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో వివిధ రకాల నిత్యావసర వస్తువులు, వాటర్ బాటిల్స్, దుప్పట్లను 5 ట్రక్కులలో విజయవాడలోని వరద బాధితులకు పంపించే ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. లంక గ్రామాలలో 4,400 పశువులకు 400 టన్నుల దాణాను సంగం డెయిరీ నుంచి తెప్పించి పంపిణీ చేసినట్లు కలెక్టర్ చెప్పారు. ఒక్కొక్క పశువుకు 25 కిలోల శక్తివంతమైన దాణా ఇవ్వటం జరిగిందన్నారు. కార్యక్రమంలో డీఆర్వో సీహెచ్ సత్తిబాబు, జిల్లా రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్, కార్యదర్శి ఓంకార్, మహిళా రెవెన్యూ ఉద్యోగుల సంఘం ఛైర్మన్ పి.రంజనీ, ప్రధాన కార్యదర్శి హజ్రాబేగం పాల్గొన్నారు.



దుప్పట్లు, నిత్యావసరాలు పంపించే వాహనానికి జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకటమురళి

వరద ప్రభావిత ప్రాంతాలకు పశువుల దాణా

వరద ప్రభావిత ప్రాంత రైతుల పశువులకు అవసరమైన దాణాను బాపట్ల జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. 12 లక్షల రూపాయల విలువైన తౌడును వాహనాలను కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి కలెక్టర్ వెంకట మురళి జెండా ఊపి పంపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బీవీ రత్నగుప్తా, తాలూకా అధ్యక్షుడు కోళ్ళపూడి శివరామప్రసాద్, తటవర్తి సత్యనారాయణ, జీవీ ఆంజనేయులు, తాళ్ళూరి రామకృష్ణ, ఊటుకూరి వెంకటేశ్వర్లు, బొలిశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

3400 ఎకరాల్లో పంట నష్టం సర్వే పూర్తి

వేమూరు, సెప్టెంబరు 8 : ప్రభుత్వ ఆదేశాల మేరకు వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలపై సర్వే ప్రారంభించినట్లు మండల వ్యవసాయ శాఖాధికారి సునీత తెలిపారు. 3,400 ఎకరాల్లో సర్వేను శనివారం పూర్తి చేశామన్నారు. ఇంకా 11,100 ఎకరాల్లో సర్వే చేయాల్సి ఉందన్నారు. 17 గ్రామాలు ఉండగా 13 రెవెన్యూ గ్రామాల పరిధిలో 13 టీమ్‌లు సర్వేను జరుపుతున్నట్లు తెలిపారు.

కలువ పూలు కోస్తూ వ్యక్తి మృతి



సుబ్బారావు మృతదేహం

నగరం,సెప్టెంబరు 8 : మండలంలోని చిలకావారిపాలెం మురుగుకాల్వలో దిగి కలువ పూలు కోస్తుండటంతో వరద ఉధృతి కారణంగా నీటిలో మునిగి రేపల్లెకు చెందిన కొలుసు సుబ్బారావు(55)మృతి చెందినట్లు ఎస్ఐ భార్గవ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం కొలుసు సుబ్బారావు రేపల్లెలోని 26వ వార్డులో పూల వ్యాపారం చేస్తుంటాడు. ఆదివారం ఉదయం కలువ పూలు కోసం వచ్చి మురుగుకాల్వలో వరద ఉధృతి కారణంగా మృతి చెందినట్లు చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

కాల్వలోకి వెళ్లిన ద్విచక్ర వాహనం : ఇద్దరికి గాయాలు

కొల్లూరు, సెప్టెంబరు 8 : ద్విచక్ర వాహనం కాల్వలోకి దూసుకెళ్లడంతో వాహన చోదకుడు గాయపడిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. కొల్లూరు గాంధీనగర్‌కు చెందిన మాగం వెంకటేశ్వర్లు మండల పరిధిలోని దోనేపూడిలో పని నిమిత్తం తన మరదలతో టీవీఎస్ మోపెడ్‌పై వెళుతుండగా ఆలపాటినగర్ సమీపంలోని మలుపు వద్ద వాహనం అదుపుతప్పి పంట కాల్వలోకి పడిపోయింది. ప్రమాదంలో వెంకటేశ్వర్లు తీవ్రంగా గాయపడ్డాడు. తలకు, ఎడమ చేతికి గాయాలయ్యాయి. మహిళకు స్వల్ప గాయాలయ్యాయి. అటుగా వెళుతున్న వాహనదారులు వెంటనే వారిద్దరితో పాటు మోపెడ్‌ను కూడా కాల్వలో నుంచి బయటకు తీసి బంధువులకు సమాచారం అందించారు.



మాట్లాడుతున్న లక్ష్మణరెడ్డి

వరద బాధితులకు ప్రభుత్వ సాయం అభినందనీయం

చీరాలటౌన్, సెప్టెంబరు 8 :కొద్ది రోజులుగా బుడమేరు వరద బాధితులకు ప్రభుత్వం అందిస్తున్న సాయం అభినందనీయమని జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం చీరాల సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో బుడమేరు నేర్పిన గుణపాఠాలపై నిర్వహించిన పత్రిక సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అహర్నిశలు శ్రమించి బాధితులకు సహాయ సహకారాలు అందించడంలో విజయవంతమైందన్నారు. వైసీపీ నాయకులు సహాయ కార్యక్రమాల్లో పాల్గొనడాన్ని మరిచి బురద జల్లే పనిలో నిమగ్నమయ్యారన్నారు. వదర నష్టం నుంచి ప్రజలకు కాపాడేందుకు ప్రభుత్వం ఆధునిక టెక్నాలజీని ఉపయోగిస్తూ డ్రోన్‌లు, హెలికాప్టర్‌లు, ఫైర్ ఇంజన్‌లు, ఎక్స్‌కవేటర్‌లు, ట్రాక్టర్‌లు ఉపయోగిస్తు అధిక సంఖ్యలో అధికారులు, సిబ్బందితో బాధితులకు అండగా నిలుస్తున్నట్లు వివరించారు. సినీరంగంతో పాటు వివిధ రకాల స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార వర్గాలు ధాతృత్వాన్ని చాటుకోవడంపై కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు సీనియర్ సిటిజన్స్ నిర్వహించిన అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం, గురు పూజ్యోత్సవ కార్యక్రమాల్లో పాల్గొని ఆయన ప్రసంగించారు. ప్రతినిధులు లక్ష్మణరెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మానవతా అధ్యక్షుడు నాగవీరభద్రాచారి, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అత్తులూరి రామారావు, రిటైర్డ్ ప్రిన్సిపాల్ బత్తుల బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.



గ్రానైట్ వ్యర్థాలను చదును చేశాక ఇలా..

సాగర్ కాలువకట్టపై వ్యర్థాలను చదునుచేశారు

● ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

మార్టూరు, సెప్టెంబరు 8 : ఎట్టకేలకు బొల్లాపల్లి బ్రిడ్జి వద్ద సాగర్ కాలువ కట్టపై పోసిన గ్రానైట్ వ్యర్థాలను రైతులకు ఇబ్బంది లేకుండా పక్కకు చదును చేశారు. రోడ్డు ప్రక్కకు కాలువ అంచుపై పోసిన వర్థాలను కూడా సరిచేశారు. బొల్లాపల్లి బ్రిడ్జి వద్ద సాగర్ కాలువ కట్టపై, కాలువ అంచులపై, బొల్లాపల్లి గ్రామంలో అదే గ్రామానికి చెందిన వ్యక్తి కొంతకాలంగా ట్రాక్టర్లు, టిప్పర్లతో గ్రానైట్ వ్యర్థాలను తెచ్చి పడేస్తున్నాడు. ఈ విషయమై 'సాగర్ కాలువైతే మాకేంటి' అన్న శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనిపై కోనంకి ఎన్ఎస్పీ అధికారులు స్పందించారు. కాలువకట్టపై గ్రానైట్ వ్యర్థాలను పోసిన వ్యక్తిపై అధికారులు ఒత్తిడితీసుకురావడంతో చేసేది లేక ఆ వ్యక్తి రెండు రోజులు ఎక్స్‌కవేటర్‌తో పోసిన వ్యర్థాలను చదును చేసి, రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేయించారు. కాలువ అంచులపై పోసినవాటిని కూడా నీటి ప్రవాహానికి ఇబ్బంది లేకుండా చేశారు.

రహస్యంగా ఆవుల తరలింపు

● గుర్తించి వదిలి వేసిన యువకులు

మార్టూరు, సెప్టెంబరు 8 : రవాణా వాహనంలో నల్లపరదా కట్టి లోపల మూడు ఆవులను కట్టి తరలిస్తుండగా యువకులు గుర్తించారు. వాహనాన్ని ఆపి ఆ మూడు ఆవులను బయటకు వదిలివేసిన ఘటన శనివారం రాత్రి మండల పరిధి కోలలపూడి రోడ్డు వద్ద జరిగింది. వివరాల్లోకి వెళితే.. చిలకలూరిపేట వైపు నుంచి ఒంగోలు వైపు వెళుతున్న లగేజి ఆటోను డ్రైవర్ టిఫిన్ చేసేందుకు శనివారం రాత్రి కోలలపూడి రోడ్డు పక్కన ఆపారు. ఆ సమయంలో వాహనంలో పెద్దగా శబ్దాలు రావడంతో అక్కడ టిఫిన్ చేస్తున్న యువకులు అనుమానంతో వాహనంపై కప్పిన పరదాను తొలగించి చూశారు. బండిలో మూడు ఆవులను కాళ్లకు, నోటికి, ఇంకా పలుచోట్ల ప్రమాదకరంగా తాళ్లతో కట్టేసి ఉండటాన్ని గుర్తించారు. ఆవులను ఎక్కడికి తీసుకెళ్తున్నావని డ్రైవర్‌ను ఆ యువకులు నిలదీశారు. అతను పొంతలేని సమాధానం చెప్పడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే కోలలపూడి, మార్టూరు గ్రామాలకు చెందిన హైందవ శక్తి సంస్థకు చెందిన కొందరు యువకులు అక్కడకు చేరుకున్నారు. ఆవులకు తాళ్లు విప్పేసి కోలలపూడి గ్రామంలో వదిలి పెట్టారు.

ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు ముమ్మరం

● ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, సెప్టెంబరు 8 : విజయవాడ శివారు ప్రాంతాల్లోని వరద బాధితులకు సీఎం చంద్రబాబు సారథ్యంలో ప్రభుత్వం అన్ని రకాలుగా సహాయక చర్యలు చేపట్టిందని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య చెప్పారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఒకటైన జక్కంపూడి ప్రాంతంలో జరిగే సహాయక చర్యలకు ఎమ్మెల్యే కొండయ్య ఇన్‌చార్జిగా ఉన్నారు. ఈ క్రమంలో ఆదివారం సీఎం చంద్రబాబు ఆ ప్రాంతాన్ని సందర్శించారు. బాధితులకు భరోసా కల్పించారు. వారి కష్టాలను అడిగి తెలుసుకున్నారు. అధికారులకు, నాయకులకు పలు అంశాలకు సంబంధించి దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో పలువురు చీరాల నియోజకవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షుడిగా సైదా



షేక్ సైదా

ఒంగోలు (క్రైం)/ పొదిలి, సెప్టెంబరు 8 : కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా పొదిలికి చెందిన షేక్ సైదా నియమితులయ్యారు. ఈమేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ.వేణుగోపాల్ ఉత్తర్వులు ఇచ్చారు. సైదా 15 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తూ పార్టీకి వెన్నుదన్నుగా నిలిచారు. గతంలో పార్టీ జిల్లా, రాష్ట్ర అధికార ప్రతినిధిగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పలు బాధ్యతలు నిర్వహించారు. విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు అలవర్చుకున్నారు. మార్కాపురం జిల్లా సాధన కోసం సమితి కన్వీనర్‌గా ఉండి అన్ని రాజకీయ పక్షాలు, ప్రజాసంఘాలను ఏకంచేసి పోరాటం చేశారు. ఆయనకు పదవి రావడంపై ఆ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. తనపై నమ్మకంతో ఇంత పెద్ద బాధ్యతను అప్పగించిన కాంగ్రెస్ పార్టీ పెద్దలకు సైదా కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటి వరకూ డీసీసీ అధ్యక్షులుగా పనిచేసిన ఈదా సుధాకర్‌రెడ్డి ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా శ్రీపతి ప్రకాష్, ఒంగోలు నగర అధ్యక్షురాలుగా దాసరి నాగలక్ష్మిని నియమించారు.

సేవాతత్పరుడు రామయ్య మృతి

● పార్థివదేహం మెడికల్ కాలేజీకి అప్పగింత

● పలువురు ప్రముఖులు నివాళి



రామయ్య(87) ఫైల్

ఇంకొల్లు, సెప్టెంబరు 8 : ఎంతోమందికి ఆర్థికంగా సహాయాన్ని అందించి, పేద వృద్ధులకు చేయూతనందిస్తూ ఇంకొల్లు ప్రాంతంలో ప్రజల మన్ననలు పొందిన భీమవరం గ్రామానికి చెందిన చుండూరి రామయ్య(87) శనివారం రాత్రి స్వగ్రామంలో మృతి చెందారు. రామయ్య పంచాయతీ రాజ్ శాఖలో సూపరింటెండెంట్‌గా పని చేసి ఉద్యోగ విరమణ పొందారు. అనంతరం తనకు వచ్చే పెన్షన్ సొమ్ముతో అతని తల్లిదండ్రులు శివయ్య, పిచ్చమ్మ చారిటబుల్ ట్రస్ట్ పేరుతో సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. రామయ్య మృతదేహాన్ని ఇంకొల్లు రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు కరి కమలేశ్వరరావు, టీడీపీ నాయుడు హనుమంతరావు, వీరగంధం ఆంజనేయులు, బోడాల శ్యాం, కరి శ్రీనివాసరావు, మార్క్, చుండూరి ఆంజనేయస్వామి, పలువురు పాత్రికేయులు సందర్శించి పూలమాలలువేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢసానుభూతి తెలిపారు. ఆయన కోరిక మేరకు పార్థిదేహాన్ని విజయవాడ సిద్ధార్థ మెడికల్ కాలేజీకి కుటుంబ సభ్యులు అప్పగించారు.

నిల్వలు నిల్ - తీవ్రమైన ఇసుక కొరత



పూర్తిస్థాయి ఉచిత విధానంపై ప్రభుత్వం మీనమేషాలు

రెచ్చిపోతున్న తెలుగు తమ్ముళ్లు

విచ్చలవిడిగా అక్రమ తవ్వకాలు

డిమాండ్ నేపథ్యంలో భారీగా ధర పెంచి విక్రయాలు

నిలిచిపోతున్న భవన నిర్మాణాలు

ఉమ్మడి జిల్లాలో ఇసుక కొరత తీవ్రమైంది. దీంతో ధర పెరిగింది. అయినప్పటికీ తగినంత ఇసుక దొరక్క భవన నిర్మాణ పనులు నిలిచిపోతున్నాయి. ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశపెట్టిన ప్రభుత్వం అమలులో మీనమేషాలు లెక్కించడం, దానికి తోడు వర్షాలు రావడం కూడా సమస్య తీవ్రతను పెంచింది. దీంతో వేలాది మంది భవన నిర్మాణ కార్మికులు పనులు లేక అవస్థ పడుతున్నారు. ప్రధానంగా చిన్నచిన్న గృహాలు కట్టుకునే వారి పరిస్థితి దయనీయంగా మారింది. జిల్లామొత్తంగా సగంలో ఆగిపోయిన గృహాలు పెద్దసంఖ్యలో దర్శనమిస్తున్నాయి. ఇసుకకు వచ్చిన డిమాండ్‌ను కొన్నిప్రాంతాల్లో తెలుగు తమ్ముళ్లు సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమంగా ఇసుకను తవ్వి నిల్వ చేసి అధిక ధరకు అమ్ముతున్నారు. ఈనేపథ్యంలో ఈనెల 11వ తేదీ నుంచి పూర్తిస్థాయిలో ఉచిత ఇసుక విధానం అమల్లోకి వస్తుందని అధికారులు ప్రకటిస్తున్నప్పటికీ అది ఎంత వరకు సాధ్యమన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. ఆ వెంటనే ఇసుక పాలసీ మారింది. దీంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. ఇసుక కష్టాలు తీరిపోయాయని భవన నిర్మాణదారులు ఆనందించారు. సొంతింటి కలను నెరవర్చుకోవాలనుకున్న వారు కూడా సంబరపడ్డారు. కానీ అంతలోనే మళ్లీ పరిస్థితి మొదటికి వచ్చింది. జిల్లాలో ప్రస్తుతం ఎక్కడా ప్రభుత్వపరంగా ఇసుక నిల్వలు కనిపించటం లేదు. దీనికితోడు ఇసుక దొరికే రీచ్‌ల్లో తవ్వుకునేందుకు అధికారిక అనుమతులు ఇవ్వడం లేదు. ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం విధివిధానాలు ప్రకటిస్తామంటూ రవాణాకు బ్రేక్ వేసింది. ఇటు ఉన్న నిల్వలు అయిపోగా, అటు కొత్తగా ఇసుక తెచ్చుకునేందుకు అవకాశం లేక వినియోగదారులు అవస్థ పడటం ఆరంభమైంది.

నిల్వచేసి విక్రయాలు

నిర్మాణదారుల అవసరాన్ని ఆసరా చేసుకొని అక్రమార్కులు రంగ ప్రవేశం చేశారు. ఆయా ప్రాంతాల వారీ కొందరు ఇసుకను అక్రమంగా తవ్వి నిల్వ చేసి విక్రయించడం ప్రారంభించారు. మరికొందరు రేయింబవళ్లు అదే పనిలో నిమగ్నమయ్యారు. జిల్లామొత్తంగా కాకపోయినా కొన్ని ప్రాంతాల్లో తెలుగు తమ్ముళ్లు ఇసుక అక్రమ వ్యాపారాన్ని జోరుగా సాగిస్తున్నారు. జిల్లాకేంద్రమైన ఒంగోలులో పవర్ ఉన్న కొందరు వాహన యజమానులు ఇదే ఆదాయమార్గంగా మార్చుకున్నారు. ధరను పెంచకపోయినా వారి కనుసన్నల్లోనే ఇసుక రవాణా జరుగుతుండటంతో సామాన్యులకు అందటం లేదు. దర్శి నియోజకవర్గంలో గుండ్లకమ్మ, చిలుకలేరు వాగుల నుంచి ఇసుకను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. మార్కాపురం ప్రాంతంలో సుమారు ఎనిమిది చోట్ల ఇసుకను అక్రమంగా నిల్వ ఉంచి అమ్ముతున్నారు. ధరను సైతం పెంచేశారు. పొరుగు ప్రాంతాల నుంచి వచ్చిన ఇసుకను ఎర్రగొండపాలెంలో అధిక ధరకు విక్రయిస్తున్నారు. కొండపి నియోజకవర్గంలోని పొన్నలూరు, జరుగుమల్లి మండలాల్లో కొందరు వ్యక్తులు ట్రాక్టర్ ఇసుకను రూ.1500 ప్రకారం అక్రమంగా విక్రయిస్తున్నారు. సంతనూతలపాడు నియోజకవర్గంలోని చీమకుర్తి మద్దిపాడు, నాగులుప్పలపాడు మండలాల్లో కూడా ఇసుక అక్రమ తవ్వకాలు, విక్రయాలు పెద్దఎత్తున సాగుతున్నాయి. కనిగిరి ప్రాంతానికి నెల్లూరు వైపు నుంచి వచ్చే ఇసుక రాకపోవడంతో నిర్మాణ పనులు నిలిచిపోయాయి.

జోరుగా అక్రమ తవ్వకాలు

చీరాలలో ఇసుక అక్రమ అమ్మకాలు కొద్ది రోజుల వరకు తారస్థాయిలో జరిగాయి. గత నాలుగైదురోజులుగా అధికారులు అడ్డు కట్ట వేసినట్లు కనిపిస్తున్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. వేటపాలెం ప్రాంతంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ డంప్ ఖాళీ అయిపోయింది. పర్చూరు నియోజకవర్గంలో ఇసుక దొరక్క నిర్మాణ పనులు మందగించాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ట్రాక్టర్ ఇసుకను రూ.6వేల నుంచి 7 వేలకు అక్రమంగా విక్రయించారు. 10 రోజుల క్రితం వరకూ కూడా అక్కడ అలాగే అమ్మారు. ప్రస్తుతం అక్రమ విక్రయాలకు కొంత బ్రేక్ పడటంతో మార్టూరు, పర్చూరు ఇంకొల్లు ప్రాంతాల్లో కూడా ఇసుక కొరతతో నిర్మాణాలు ఆగిపోయాయి. అద్దంకి ప్రాంతంలో గత ప్రభుత్వంలో ట్రాక్టర్ ఇసుక రూ.3500 విక్రయించారు. అదే తరహాలో ఈ ప్రభుత్వంలోనూ అమ్మకాలు మొదలయ్యాయి. మంత్రి రవికుమార్ నుంచి హెచ్చరికలు రావడంతో ధరను రూ. 2,500కు తగ్గించారు. ధర తగ్గటంతో విక్రయాలు పెరిగి ఇసుక కొరత నెలకొంది. కందుకూరు ప్రాంతంలో అధికార పార్టీకి చెందిన ఇద్దరు బహిరంగంగా ఇసుక రవాణా చేస్తున్నారు.

కలిసొచ్చిన ఇసుక డిమాండ్

ఉచిత ఇసుక విధానం అమలు కాకపోవడం, ఇసుకకు డిమాండ్ రావడం అక్కమార్కులకు కలిసొచ్చింది. అవకాన్ని ఆసరా చేసుకొని గతం కన్నా ఇసుక ధరను పెంచేశారు. గిద్దలూరు ప్రాంతంలో గతంలో ఉన్న ధర కన్నా టన్నుకు రూ.300 అదనంగా వసూలు చేస్తున్నారు. 35 టన్నుల ఇసుక పట్టే లారీకి 20 టన్నులు మాత్రమే ఎత్తుకునే అవకాశం ఇవ్వడంతో కొనుగోలుదారులు అధికంగా నష్టపోతున్నారు. మార్కాపురం ప్రాంతంలో టన్ను ఇసుకను రూ.2వేలకు విక్రయిస్తున్నారు. ఎర్రగొండపాలెంలోనూ బయట ప్రాంతాల నుంచి వచ్చిన లారీ ఇసుకపై రూ.7వేలు అదనంగా అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. ఇలా దాదాపు అన్ని ప్రాంతాల్లో ఇసుక ధరను అక్రమార్కులు పెంచేశారు.

పట్టించుకోని అధికారులు

ధర పెరగటంతోపాటు సరిపడా ఇసుక దొరక్కపోవడంతో నిర్మాణదారులు పనులను నిలిపివేయాల్సిన పరిస్థితి నెలకొంది. దీనికి వర్షాల సమస్య కూడా తోడైంది. ఇటు అక్రమ వ్యాపారం, ధర పెరిగిపోతున్నా మైనింగ్, ఎస్ఈబీ, పోలీసు అధికారులు పట్టించుకోవడం లేదు. సామాన్యులపై కొరడా ఝులిపించడమే తప్ప అక్రమ వ్యాపారం చేసే వారి జోలికి వెళ్లడం లేదు. పైగా అధికార పార్టీ వారు అక్రమ అమ్మకాలు చేస్తున్నా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇదిలా ఉండగా ఈనెల 11 నుంచి ఉచిత ఇసుక విధానాన్ని పకడ్బందీగా అమలు చేస్తామని సంబంధిత అధికారులు చెబుతున్నప్పటికీ అందుకు అనుగుణమైన పరిస్థితి క్షేత్రస్థాయిలో కనిపించడం లేదు.

వరద బాధితులకు అండ

కలెక్టర్ అన్సారియా పిలుపుతో ముందుకొస్తున్న దాతలు

జిల్లా నుంచి 1.30లక్షల ఆహార ప్యాకెట్లు, 50 వేల వాటర్ బాటిళ్లు

ప్రత్యేక వాహనాల్లో విజయవాడకు తరలింపు

ఒంగోలు (కలెక్టరేట్), సెప్టెంబరు 8 : విజయవాడ వరద బాధితులకు జిల్లా అధికార యంత్రాంగం అండగా నిలుస్తోంది. కలెక్టర్ తమీమ్ అన్సారియా చొరవతో ఉద్యోగులతో పాటు ప్రజాప్రతినిధులు, వివిధ వర్గాల ప్రజలు మేము సైతం అంటూ ముందుకు వస్తున్నారు. దాతల సహకారంతో జిల్లా కేంద్రమైన ఒంగోలులోని మూడు ప్రాంతాల్లో ఆహారాన్ని వండించి, ప్యాకింగ్ చేయించి ప్రత్యేక వాహనాల్లో విజయవాడకు పంపుతున్నారు. ఐదు రోజులుగా ఈ ప్రక్రియ కొనసాగుతోంది. ఆదివారం కూడా ఒంగోలు నుంచి లక్షా 30వేల ఆహార ప్యాకెట్లు, 50వేల వాటర్ బాటిళ్లను విజయవాడలోని వరద బాధిత ప్రాంతాలకు పంపారు. సంతనూతలపాడు శాసనసభ్యుడు బీఎన్ విజయ్‌కుమార్ రూ.5 లక్షల వ్యయంతో పది వేల పులిహోర ప్యాకెట్లను కలెక్టర్ తమీమ్ అన్సారియా ద్వారా విజయవాడకు తరలించారు. జిల్లా పంచాయతీ ఆధ్వర్యంలో పది వేల పులిహోర ప్యాకెట్లను పంపారు. ఇంకోవైపు వివిధ సంస్థలు, సంఘాల ప్రతినిధులు కూడా బాధితులకు తమవంతుగా విరాళాలను అందజేస్తున్నారు. జిల్లా నలుమూలల నుంచి కూడా అవకాశం ఉన్న మేరకు బాధిత కుటుంబాలకు ఆహారం, మంచినీళ్లను అధికార యంత్రాంగం ప్రత్యేక చొరవతో వాహనాలను ఏర్పాటు చేసి విజయవాడకు పంపుతోంది. ఒంగోలులోని ఏ-1 కన్వెన్షన్ హాలులో ఆహారం ప్యాకింగ్‌ను కలెక్టర్ అన్సారియా ఆదివారం పరిశీలించారు. పులిహోరను రుచి చూసి అక్కడ ఇన్‌చార్జిలుగా ఉన్న అధికారులకు పలు సూచనలు చేశారు. వర్షం కురిసినా ప్యాకెట్లు దెబ్బతినకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మరోవైపు విజయవాడలో వరద బాధితుల సహాయక చర్యల్లో జిల్లా యంత్రాంగం భాగస్వామ్యమైంది. ఇక్కడి నుంచి వెళ్లిన పారిశుధ్య కార్మికులు అక్కడి పలుకాలనీల్లో సహాయక పనులు చేస్తున్నారు.



ఎ1లో పులిహోర ప్యాకింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా



విజయవాడ బయలుదేరి వెళుతున్న మెప్మా మహిళలు

విజయవాడకు 3 వేల మంది పొదుపు మహిళలు

ఒంగోలు (కార్పొరేషన్) : విజయవాడలో వరద బాధితులకు సేవలందించేందుకు ఒంగోలులోని పొదుపు సంఘాల మహిళలు ముందుకొచ్చారు. మెప్మా సీఎంఎం కొండయ్య ఆధ్వర్యంలో ఆదివారం 3వేల మంది పొదుపు మహిళలు, 150 మంది ఆర్పీలు 50 బస్సుల్లో ఆదివారం విజయవాడకు బయల్దేరి వెళ్లారు. అక్కడ వరద బాధితులకు ఆహారం అందజేయడంతోపాటు, అవసరమైన సేవల్లో భాగస్వాములయ్యారు.

నేడు 'మీ కోసం' రద్దు

ఒంగోలు (కలెక్టరేట్), సెప్టెంబరు 8 :ఒంగోలులోని కలెక్టరేట్‌తోపాటు డివిజన్, మండల స్థాయిలో ప్రతి వారం నిర్వహించే మీ కోసం కార్యక్రమాన్ని ఈ సోమవారం తాత్కాలికంగా రద్దు చేసినట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. ఆమేరకు ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. విజయవాడలో వరద సహాయక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో అధికారులు, సిబ్బంది వెళ్లారని ఆమె తెలిపారు. ఈనేపథ్యంలో మీ కోసం కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు చెప్పారు. ప్రజలు ఈవిషయాన్ని గమనించాలన్నారు. దూరప్రాంతాల నుంచి ఒంగోలుకు, డివిజన్, మండల కేంద్రాలకు ఎవ్వరూ రావద్దని కలెక్టర్ కోరారు

ముప్పాళ్ల సొసైటీపై విచారణకు ఆదేశం

● డీసీవో శ్రీనివాసరెడ్డి

ఒంగోలు (విద్య), సెప్టెంబరు 8 : హనుమంతునిపాడు మండలం ముప్పాళ్లపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో చోటుచేసుకున్న అక్రమాలపై విచారణకు ఆదేశించినట్లు జిల్లా సహకారాధికారి బి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. విచారణాధికారిగా పీడీసీసీ బ్యాంకు ఏజీఎం సుభానీని నియమించినట్లు చెప్పారు. శనివారం ఆంధ్రజ్యోతిలో 'ముప్పాళ్లపాడు సొసైటీలో భారీ అక్రమాలు' శీర్షికన ప్రచురితమైన కథనంపై డీసీవో వివరణ ఇచ్చారు. నివేదికను రెండు నెలల్లో సమర్పించాలని విచారణాధికారిని ఆదేశించినట్లు తెలిపారు. అది అందగానే బాధ్యులపై సివిల్, క్రిమినల్, క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు.

ఇన్‌చార్జి జేసీగా శ్రీలత

ఒంగోలు (కలెక్టరేట్), సెప్టెంబరు 8 : జాయింట్ కలెక్టర్‌గా ఇన్‌చార్జి బాధ్యతలను జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలతకు అప్పగిస్తూ కలెక్టర్ తమీమ్ అన్సారియా ఉత్తర్వులు ఇచ్చారు. రెగ్యులర్ జేసీ గోపాలకృష్ణను ఎన్టీఆర్ జిల్లాలో వరద సహాయ కార్యక్రమాల కోసం ప్రభుత్వం అక్కడికి డిప్యుటేషన్ వేసింది. దీంతో పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా శ్రీలతను ఇన్‌చార్జిగా నియమించారు.

పేకాట శిబిరంపై దాడి

మార్టూరు, సెప్టెంబరు 8 : మార్టూరులో కొణిదెనరోడ్‌లో పేకాడుతున్న వారిపై ఆదివారం రాత్రి పోలీసులు దాడి చేశారు. వారినుంచి భారీగా నగదును స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. గ్రానైట్ అక్రమ రవాణాలో కోట్లాదిరూపాయలు సంపాదించిన మార్టూరుకు చెందిన ఒక వ్యక్తి ఆఫీసులో కొంతమంది వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు తెలియడంతో పోలీసులు దాడి చేశారు. ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.3,69,500 స్వాధీనం చేసుకున్నారు.

గ్రానైట్ క్వారీల్లో భద్రత డొల్ల

కృష్ణసాయి గ్రానైట్‌లో కూలిన హైవాల్

నేడు పరిశీలించనున్న మైనింగ్ భద్రతాధికారులు

కేసు నమోదు చేసిన పోలీసులు

ఒంగోలు (క్రైం), సెప్టెంబరు 8 : గ్రానైట్ క్వారీల్లో భద్రత డొల్లగా మారింది. నిబంధనలు తుంగలో తొక్కి యాజమాన్యాలు ఇష్టానుసారం రాయిని తవ్వుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ కూడా లోపించడంతో క్వారీల్లో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వాటి నుంచి గుణపాఠం నేర్చుకోకపోవడంతో కార్మికుల పరిస్థితి దినదినగండంలా మారింది. 2009లో చీమకుర్తి సమీపంలోని హంసా గ్రానైట్‌లో హైవాల్ కూలి 14 మంది కార్మికులు సజీవ సమాధి అయ్యారు. అప్పటి నుంచి భద్రతాచర్యలు కట్టుదిట్టం చేశారు. అయినప్పటికీ కొందరు క్వారీ యాజమానులు తవ్వకాల విషయంలో నిబంధనలు పాటించడం లేదు. దీనిపై ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతున్నా అధికారులు పటించుకోవడంలేదు. ఈనేపథ్యంలోనే ఈనెల 5వతేదీ తెల్లవారుజామున రామతీర్థం వద్ద ఉన్న కృష్ణసాయి గ్రానైట్ క్వారీలో హైవాల్ కూలింది. ఆసమయంలో అక్కడ అసలు పనులు చేయడం లేదని యాజమాన్యం చెప్తోంది. సంఘటనా స్థలాన్ని స్వయంగా పరిశీలించిన ఎస్పీ దామోదర్ అక్కడ నిబంధనలు పాటంచడం లేదని గుర్తించారు. ఆయన ఆదేశాల మేరకు కృష్ణసాయి గ్రానైట్స్ క్వారీ యజమానుల పై పోలీసులు కేసు నమోదు చేశారు.

అనేక ఆరోపణలు

ఓరియంట్ క్వారీని కృష్ణసాయి గ్రానైట్స్ యాజమాన్యం లీజుకు తీసుకుంది. 2006 ఏప్రిల్ నుంచి 2023 మే వరకు ఆ కంపెనీకి లీజు అనుమతులు ఉన్నాయి. తిరిగి మరలా లీజుకు తీసుకునేందుకు మైనింగ్ అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం అది పెండింగ్‌లో ఉంది. కానీ ఎలాంటి అనుమతులు లేకుండా అక్కడ క్వారీయింగ్ చేస్తున్నారని అధికారులకు కొందరు ఫిర్యాదులు చేశారు. దీంతో ఈనెల 4న మైన్స్ సేఫ్టీ డీడీ జ్ఞానేశ్వర్ తన సిబ్బందితో కృష్ణసాయి గ్రానైట్‌ను పరిశీలించారు. ఆ మరుసటి రోజే హైవాల్ కూలిపోవడం గమనార్హం. ఇలా అనేక క్వారీలలో వాల్స్‌కు బెంచ్ కటింగ్ లేకుండా తవ్వకాలు జరుపుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. క్వారీయింగ్‌లో ప్రతి 7 మీటర్లకు ఒక బెంచ్ కటింగ్ పెట్టాలి. అందుకు విరుద్ధంగా తవ్వకాలు చేయడం వల్లనే ఇలా క్వారీల గోడలు కూలి ప్రమాదాలు జరుగుతున్నాయి.



కృష్ణసాయి యాజమాన్యంపై కేసు నమోదు

కృష్ణసాయి గ్రానైట్ యజమాన్యంపై చీమకుర్తి పోలీసులు కేసు నమోదు చేశారు. వారికి సంబంధించిన క్వారీలో హైవాల్ కూలి పడిపోయింది. ఈమేరకు ఆప్రాంత వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఏమైనా ప్రాణనష్టం జరిగిందా అన్న కోణంలో ఎస్పీ ఏఆర్ దామోదర్ శుక్రవారం సాయత్రం హుటాహుటిన క్వారీని పరిశీలించిన తరువాత పోలీసులు స్పందించారు. అర్ధరాత్రి కేసు నమోదు చేశారు.

నేడు క్వారీని పరిశీలించనున్న మైనింగ్ భద్రతాధికారులు

కృష్ణసాయి గ్రానైట్‌లో ప్రమాదం జరిగిన క్వారీని మైనింగ్ శాఖ భద్రతాధికారులు సోమవారం పరిశీలించనున్నారు. అక్కడ ప్రస్తుతం క్వారీయింగ్‌కు అనుమతులు లేవు. ఏడాది క్రితం పనులు నిలిపి వేసినట్లు యాజమాన్యం చెప్తోంది. అలాంటప్పుడు గోడ ఎలా కూలిందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పుట్టంరాజుకు నంది పురస్కారం

అద్దంకిటౌన్, సెప్టెంబరు 8 : సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా తిరుపతిలో అభిలాషా హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యారంగంలో విశిష్ట సేవలందిస్తున్న పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తికి సంస్థ నంది పురస్కారంతో సత్కరించింది. ఈ సందర్భంగా అద్దంకికి చెందిన పలువురు సాహితీ సంస్థల ప్రతినిధులు, సభ్యులు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తిని అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.



పురస్కారాన్ని అందుకుంటున్న శ్రీరామచంద్రమూర్తి

ఇటుకకు గడ్డు కాలం

- భారీగా నిల్వలు
- ప్రభుత్వ గృహ నిర్మాణాలు ప్రారంభమైతేనే గట్టెక్కేది
- ఆందోళనలో బట్టీ నిర్వాహకులు



తిమ్మాయపాలెం సమీపంలోని ఇటుక బట్టీ

అద్దంకి, సెప్టెంబరు 8 : ఇటుక పరిశ్రమకు గడ్డు కాలం వచ్చింది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇటుక తయారీ తక్కువగా చేసినప్పటికీ అవి కూడా అమ్మకాలు లేక భారీగా నిల్వలు పేరుకు పోయాయి. అద్దంకి ప్రాంతం లో దశాబ్దకాలం కిందట వందకుపైగా ఇటుక బట్టీలు ఉన్నాయి. క్రమేపీ తగ్గుతూ వచ్చాయి. ప్రస్తుతం 70కి లోపే ఉన్నాయి. సాధారణంగా ప్రతి ఏటా 10కోట్ల ఇటుకలను తయారీ చేస్తుంటారు. కానీ ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కూలీలు ముందుగానే వెళ్లడంతో సుమారు 8కోట్ల ఇటుకలు తయారు చేశారు. నాలుగైదు నెలలుగా కనీసం 2కోట్ల ఇటుకలు కూడా అమ్మకాలు జరగలేదు. జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణం నిలిచిపోవడంతో పాటు ఇసుక ఇంకా పూర్తి స్థాయిలో లభ్యం కాకపోవడంతో భవన నిర్మాణాలు సాగడం లేదు. దీంతో ఇటుక అమ్మకాలు బాగా తగ్గిపోయినట్లు బట్టీల నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అప్పులు తెచ్చి ఇటుకలను తయారు చేశామని, భారీగా నిల్వలు పేరుకు పోవడంతో పెట్టుబడులకు వడ్డీలు పెరిగి మరింత భారంగా మారాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ధరలు కూడా తగ్గించి అమ్మకాలు చేయాల్సి వస్తుందని ఇటుక బట్టీల యజమానులు చెప్తున్నారు.

పెరిగిన ఉత్పత్తి వ్యయం

ఇటుక తయారీకి వినియోగించే వరిపొట్టు, బొగ్గు ధరలు భారీగా పెరగడంతో తయారీ వ్యయం భారీగా పెరిగింది. గతంలో టన్ను వరి పొట్టు 2 వేలు ఉండగా, ప్రస్తుతం 6వేలకు చేరింది. ఇక బొగ్గు టన్ను 3వేల నుంచి 9 వేల రూపాయలకు పెరిగింది. వీటన్నింటికీ మించి కూలీల ఖర్చు కూడా బాగా పెరగడంతో ఒక్కో ఇటుక తయారీకి రూ.7 నుంచి రూ.7-50పైసలు ఖర్చు అవుతున్నట్లు ఇటుక బట్టీల యజమానులు తెలిపారు. ఇటుకకు డిమాండ్ లేకపోవడంతో పెట్టుబడి ధర లేక పోయినా నష్టానికి అమ్మాల్సి వస్తుందని, ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్‌లో ఇటుక బట్టీల నిర్వహణ మరింత కష్టంగా మారే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. కొత్త ప్రభుత్వంలో గృహ నిర్మాణాలు చేపడితేనే మరలా ఇటుక అమ్మకాలు ఊపందుకుంటాయని లేకపోతే వచ్చే ఏడాది కూడా తయారీ నిలిపి వేయడం మినహా వేరే గత్యంతరం లేదని పలువురు ఇటుక బట్టీల యజమానులు అభి ప్రాయపడుతున్నారు.



టోల్‌గేట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

మెరుగైన సేవల కోసమే టోల్‌గేట్ ఏర్పాటు

ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, సెప్టెంబరు 8 : తీరప్రాంతమైన వాడరేవు సముద్రతీరానికి వచ్చే పర్యాటకులకు మెరుగైన సేవలు అందించేందుకు టోల్‌గేట్‌ను ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య చెప్పారు. కీర్తివారిపాలెం వద్ద గతంలో ఏర్పాటు చేసిన టోల్‌గేట్‌ను ఆదివారం ఎమ్మెల్యే కొండయ్య పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ పర్యవేక్షణలో టోల్‌గేట్ కొనసాగుతుందన్నారు. తీరంలో పార్కింగ్, పారిశుధ్యం, ఇతర గ్రామాభివృద్ధికి, విద్యుత్ లైట్ల నిర్వహణ తదితది అవసరాలకు టోల్‌గేట్ ద్వారా వచ్చే నిధులను వినియోగిస్తారన్నారు. అంత పారదర్శకంగా ఉండాలలని నిర్వాహకులకు ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో రూరల్ సీఐ నిమ్మగడ్డ సత్యన్నారాయణ, పంచాయితీ కార్యదర్శి, సిబ్బంది, నాయకులు పిక్క నారాయణ పాల్గొన్నారు.



ఎక్స్‌కవేటర్‌తో బీటీ రోడ్డును బాగుచేస్తున్న కార్మికులు

స్వచ్ఛందంగా రోడ్డుకు మరమ్మతులు

పంగులూరు, సెప్టెంబరు 8 : అడుగడుగునా భారీ గోతులతో కుంటలను తలపిస్తున్న బీటీ రోడ్డుకు రామకూరు గ్రామ ఉప సర్పంచ్ పెడవల్లి అశోక్ తన సొంత నిధులతో మరమ్మతులు చేపట్టారు. మండలంలోని రామకూరు గ్రామం నుంచి బొల్లాపల్లి వైపు 16వ నెంబరు జాతీయ రహదారికి వెళ్లే రోడ్డు నిడివి మూడు కిలోమీటర్లు. ఈ రోడ్డుపై ఏర్పడిన భారీ గోతులతో ప్రజలు రాకపోకలు సాగించలేక ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నారు. అద్దంకి బ్రాంచి కెనాల్ కట్టపై నిర్మితమైన ఈ బీటీ రోడ్డు దుస్థితిని గుర్తించిన గ్రామ ఉప సర్పంచ్ పెడవల్లి అశోక్ రూ20వేలు వెచ్చించి గోతులకు రెడ్ మిక్సింగ్‌తో పూడ్చి ఎక్స్‌కవేటర్‌తో బాగుచేచించారు. దీంతో రాకపోకలకు ఇబ్బందులు తొలగాయి. ఉప సర్పంచ్ అశోక్‌కు ప్రజలు అభినందనలు తెలిపారు.

ఇద్దరు యువకులకు గాయాలు

మార్టూరు, సెప్టెంబరు 8 : మండల పరిధిలో కోనంకి నుంచి కోలలపూడి రోడ్డుకు వెళ్లే సర్వీసు రోడ్‌లో రెండు ద్విచక్రవాహనాలదారులు ఎదురెదురుగా ఢీకొన్న ఘటన ఆదివారం జరిగింది. కోలలపూడి గ్రామానికి చెందిన తరుణ్ కుమార్, కోనంకి గ్రామానికి చెందిన అంజనేయులు మోటారుసైకిళ్లపై ఎదురెదురుగా ఢీకొన్నారు. మోటారుసైకిళ్ల రోడ్డుపై పడిపోవడంతో ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. వారిని హైవే అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

వినాయక ఉత్సవాల్లో అపశ్రుతి

టపాసులు పడి ముగ్గురు చిన్నారులకు గాయాలు



చికిత్స పొందుతున్న చిన్నారులు

చీరాలటౌన్, సెప్టెంబరు 8 : రామాపురంలో వినాయక ఉత్సవాల్లో అపశ్రుతి ఏర్పడింది. దీంతో ముగ్గురు చిన్నారులు గాయపడ్డారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో పెద్ద బ్యాచ్, చిన్న బ్యాచ్ అని పిలుచుకుంటున్న రెండు వర్గాలకు సంబంధించి గతంలో పలు కేసులు ఉన్నాయి. ఇటీవల పోలీసులు, నాయకుల సహకారంతో కొంతమేరకు గ్రామంలో పరిస్థితులు చక్కబడ్డాయి. ఆదివారం ఉదయం జరిగిన ఘటన మరలా వివాదానికి దారి తీసింది. పెద్ద బ్యాచ్ ఆదివారం గణేషు నిమజ్జనం ముగించుకుని ఇంటికి వస్తున్నారు. అదే సమయంలో చిన్నబ్యాచ్‌కు సంబంధించిన వినాయకుని ఉత్సవాల్లో టపాసులు పేల్చారు. ఆ సమయంలో పెద్దబ్యాచ్ వారు పరుగులు తీసి పక్కకు వెళ్లారు. కానీ అదే బ్యాచ్‌కు చెందిన చిన్నపిల్లలు పొన్నపూడి లాస్య, వాయిల యమున, కుర్రు అనూరాధ టపాసులు తగిలి శరీరంపై పలుచోట్ల గాయాలయ్యాయి. దీంతో ఇరువర్గాల మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. ఈపూరుపాలెం ఎస్ఐ శివకుమార్ క్షతగాత్రులను 108లో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. సీఐలు సత్యనారాయణ, శ్రీనివాసరావు హాస్పిటల్‌కు వెళ్లి పరిశీలించారు. విషయంపై ఆరా తీశారు. ఈమేరకు అవుట్‌పోస్ట్ పోలీసులు వివరాలను నమోదు చేసుకున్నారు. ఘటనపై గడియార స్తంభం కూడలి వద్ద బాధితులు ఆందోళన చేసేందుకు సమాయత్తమయ్యారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు వారికి సర్ది చెప్పి పంపారు.

నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

చీరాలటౌన్, సెప్టెంబర్ 8 : ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. స్టేషన్ పరిధిలోని నాయినిపల్లిలో అందిన సమాచారం మేరకు ఎస్సై సిబ్బందితో కలిసి ఆదివారం రాత్రి దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా ఓ వ్యక్తి అక్రమంగా నిల్వచేసి విక్రయిస్తున్న 10 క్వార్టర్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అతడిపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు.

జాతీయ రహదారిలో రోడ్డు ప్రమాదం

చీరాలటౌన్, సెప్టెంబరు 8 : జాతీయ రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయపడ్డాడు. ఈ ఘటన ఆదివారం మధ్యాహ్నం కొత్తరెడ్డిపాలెం జంక్షన్ వద్ద చోటుచేసుకుంది. వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. చినగంజాం మండలం మోటుపల్లి పంచాయతీ అడవిపాలెంకు చెందిన మునగాని అజయ్ ద్విచక్ర వాహనంపై చీరాలకు వచ్చాడు. అనంతరం తిరిగి వెళుతుండగా రోడ్డు క్రాస్ చేసేందుకు ఆగి ఉన్న ద్విచక్ర వాహనాన్ని కారు వేగంతో ఢీకొట్టింది. ప్రమాదంలో అజయ్ ఎగిరి రోడ్డు పక్క పొలాల్లో పడి గాయపడ్డారు. వేటపాలెం ఎస్ఐ క్షతగాత్రుడిని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి, కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.



ప్రమాద వివరాలను తెలుసుకుంటున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు



సత్యం మృతదేహానికి నివాళులర్పిస్తున్న కరణం

టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు సత్యం మృతి

నివాళులర్పించిన కరణం, టీడీపీ నేతలు

బల్లికురవ, సెప్టెంబరు 8 : బల్లికురవ మండలం కొండాయపాలెం గ్రామానికి మాజీ సర్పంచ్, టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు పావులూరి సత్యనారాయణ (65) ఆదివారం ఆసుపత్రిలో చికిత్స పొందుతు మృతి చెందారు. రెండురోజుల కిందట ఆయన స్వగృహంలో బాత్‌రూంలో కాలిజారి పడిపోయారు. తలకు గాయం కావడంతో గుంటూరు వైద్యశాలకు తరలించారు. కోమాలవోకి వెళ్లి ఆదివారం మృతి చెందారు. మృతదేహాన్ని మార్టూరుకు తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. ఆయనకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు. మృదు స్వభావిగా పేరు పొంది, పార్టీ కోసం అహర్నిశలు కృషి చేసిన సత్యం అకాల మృతిపై మంత్రి గొట్టిపాటి రవికుమార్ సంతాపం తెలిపారు. సత్యం మృతదేహాన్ని టీడీపీ, వైసీపీ నేతలతో పాటు గ్రానైట్ యజమానులు సందర్శించి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే కరణం బలబలరాం నివాళులర్పించారు. తనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకొని కుమారుడు వేణుబాబును ఓదార్చారు. టీడీపీ యువనేత గొట్టిపాటి కమల్‌కిషోర్, స్థానిక నాయకులు నివాళులర్పించారు.

వర్షానికి కూలిన చెట్టు



నేల కూలిన చెట్టు

మార్టూరు, సెప్టెంబరు 8 : నాలుగురోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎంపీడీవో కార్యాలయం ముందు ఉన్న భారీ చెట్టు శనివారం రాత్రి కూలిపోయింది. వాస్తవంగా పగటి సమయంలో పలువురు వ్యక్తులు చెట్టు పక్కన ఉన్న రోడ్డు ద్వారా కూరగాయల మార్కెట్‌కు, లేదా ఎంపీడీవో ఆఫీస్‌కు వివిధ పనులు కోసం వస్తుంటారు. ఆ సమయంలో చెట్టు కూలి ఉంటే పెద్ద ప్రమాదమే జరిగి ఉండేది.

చీరాల ప్రజలకు అండగా ఉంటాం

ఎంపీ కృష్ణప్రసాద్



జరీ కండెలను పరిశీలిస్తున్న ఎంపీ దంపతులు

చీరాలటౌన్, సెప్టెంబరు 8 : చీరాల ప్రజలకు అన్ని విధాలుగా కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ హామీ ఇచ్చారు. ఎంపీ కృష్ణప్రసాద్ సతీమణి శిరీషతో కలిసి ఆదివారం చీరాలలో విస్తృత పర్యటన చేశారు. ముందుగా సెయింట్ మార్క్స్ లూథరన్ చర్చిలో నిర్వహించిన ప్రార్థనలలో పాల్గొని, అక్కడి నూతన నిర్మాణాలను పరిశీలించారు. వేటపాలెం మండల పరిధి ఆమోదగిరిపట్నంలోని వినాయక మండపాన్ని సందర్శించి పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నవితరణ చేశారు. సమీపంలోని ఓ చేనేత కుటుంబం నిర్వహిస్తున్న జరీ కండెలను పరిశీలించి, వానలతో మగ్గం సాగడం లేదని తెలుసుకున్న ఎంపీ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఎంపీ వెంట టీడీపీ నాయకురాలు సజ్జా హేమలత, కూటమి ప్రతినిధులు పాల్గొన్నారు.

శ్రీ కామాక్షి కేర్ సేవలు అభినందనీయం



దేవరాజును సత్కరిస్తున్న సెంటర్ ప్రతినిధులు

చీరాలటౌన్, సెప్టెంబరు 8 : చీరాల పరిధిలోని ప్రజలకు శ్రీ కామాక్షికేర్ హాస్పిటల్స్ వారు అందిస్తున్న సేవలు అభినందనీయమని విఠల్‌నగర్ మనో వికాస్ కేంద్రం డైరక్టర్ వెంకన్నబాబు అన్నారు. ప్రపంచ ఫిజియోథెరపీ డేని సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. హాస్పిటల్ మేనేజింగ్ డైరక్టర్ తాడివలస దేవరాజు ను, ఫిజియో థెరపిస్ట్ మాధురిని ఘనంగా సత్కరించారు. దేవరాజు మాట్లాడుతూ కీళ్ల పనితీరు, నొప్పులు జీవన మనుగడను సాగించడంలో ఫిజియోథెరపీ ప్రాముఖ్యతను సంతరించుకున్నట్లు చెప్పారు. నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి

- ఎలాంటి ఘటనలు జరిగినా కమిటీ సభ్యులదే బాధ్యత
- అద్దంకి టౌన్ సీఐ కృష్ణయ్య



నిర్వాహకులతో మాట్లాడుతున్న సీఐ కృష్ణయ్య

అద్దంకి, సెప్టెంబరు 8 : వినాయక విగ్రహాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా కమిటీ సభ్యులే బాధ్యత వహించాల్సి ఉంటుందని అద్దంకి టౌన్ సీఐ కృష్ణయ్య అన్నారు. అద్దంకి పట్టణ, మండల పరిధిలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల కమిటీల సభ్యులతో ఆదివారం మధ్యాహ్నం స్థానిక పోలీస్ స్టేషన్ లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ కృష్ణయ్య మాట్లాడుతూ వినాయక విగ్రహాల వద్ద రాత్రి సమయాలలో కమిటీ సభ్యులు కాపలా ఉండాలన్నారు. పూజా కార్యక్రమాలు నిర్వహించే క్రమంలో ఎలాంటి అగ్ని ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సాంస్కృతిక కార్య క్రమాలు నిర్వహించుకునేటప్పుడు తగు జా గ్రత్తలు తీసుకోవాలన్నారు. నిమజ్జనం ఉత్సవాల సమయంలో కూడా ఎలాంటి ఘర్షణలకు తావులేకుండా తగు జా గ్రత్తలు తీసుకోవాలన్నారు. ముందస్తుగా అనుమతి తీసుకున్న రోజే కచ్చితంగా నిమజ్జనం చేసుకోవాలన్నారు. రాత్రి సమయాలలో పోలీస్ సిబ్బంది గస్తీ తిరుగుతూ ఆయా వి గ్రహాల వద్ద పరిశీలన చేయడం జరుగుతుందని, ఆ సమయంలో అక్కడ కమిటీ సభ్యులు ఉండాలన్నారు. టౌన్ సర్కిల్ పరిధిలో ఇప్పటి వరకు 55 విగ్రహాలకు సంబంధించి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు అందినట్లు సీఐ కృష్ణయ్య తెలిపారు. అయితే సుమారు 100 వరకు విగ్రహాలను ఏర్పాటు చేసినట్లు తెలుస్తుందని చెప్పారు.



ప్రమాణం చేస్తున్న వాసవీ దేవస్థాన అధ్యక్షుడు, కార్యవర్గం

వాసవీ దేవస్థానం నూతన కమిటీ ప్రమాణం

అద్దంకి, సెప్టెంబరు 8 : అద్దంకి పట్టణంలోని చక్ర సహిత వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం, వాసవీ ఆర్యవైశ్య కల్యాణ మండపం 9 వ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షునిగా ఊటుకూరు రామకోటేశ్వరరావు, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా చిన్ని లక్ష్మీ శ్రీనివాసరావు, ప్రధానకార్యదర్శిగా ఆర్వపల్లి హనుమంతరావు, కోశాధికారిగా నేరెళ్ల శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పోకూరి వెంకట శ్రీనివాసరావుతో పాటు పలువురు ఉపాధ్యక్షునిగా, ఉప కార్యదర్శులుగా, ఉప కోశాధికారులుగా, లీగల్ అడ్వైజర్స్‌గా, కన్వీనర్స్‌గా, కార్యవర్గ సభ్యులుగా ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్య క్రమంలో ఊటుకూరు ఉమా అన్నపూర్ణ, పువ్వాడ అనంత శివకోటేశ్వరరావు, సంకా సుబ్రహ్మణ్యం, భోజనపల్లి సత్యనారాయణ, కొత్తమాసు చంద్రశేఖరరావు, సోమిశెట్టి సుబ్బరాయుడు, చిన్ని మురళీకృష్ణ, చిన్ని వీరయ్య, గోపు శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షురిగా కోట శ్రీనివాసకుమార్, చిన్ని శ్రీమన్నారాయణ, జొన్నలగడ్డ సుబ్బరాయుడు, శ్రీరాం నాగేశ్వరరావు, మారం హనుమంతరావు పాల్గొన్నారు. నూతన కార్యవర్గ పదవీకాలం 5 ఏళ్లు కొనసాగనుంది. వారిని పలువురు అభినందించారు.



ఆటోకు జెండా ఊపి ప్రారంభిస్తున్న సంఘ నేతలు

ఆహార పదార్థాల తరలింపు

అద్దంకి, సెప్టెంబరు 8 : విజయవాడ వరద బాధితులకు అంబేడ్కర్ యువజన సంఘం అద్దంకి నియోజకవర్గ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఆహార పదార్థాలను తీసుకు వెళ్లి పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం నేతలు నక్కా కాంతారావు, దెబోరాసరళ, మోదేపల్లి పిహెచ్‌సి వై ద్యులు డాక్టర్ బాలరాజు, గోపతోటి సాంసన్,మందా జోషఫ్, పులిపాటి హేబేలు, యరమోతు నాగయ్య, మట్టకొయ్య బాబు, జోషి పాల్గొన్నారు.

వరద బాధితులకు యూటీఎఫ్ సాయం

చీరాలటౌన్ : వరద బాధితులకు చీరాల యూటీఎఫ్ ప్రతినిధులు తయవంతు సాయం అందించారు. రాష్ట్ర కమిటీ పిలుపుతో ప్రతినిధులు వస్త్రాలను సమీకరించారు. వీటిల్లో చిన్న, పెద్ద సైజుల వారీగా ప్యాకింగ్ చేసి వాహనాన్ని ఆదివారం భట్టిప్రోలుకు పంపారు.

భక్తిశ్రద్ధలతో వినాయక చవితి



బల్లికురవలో బుజ్జి గణపయ్యను నిమజ్జనానికి తీసుకెళ్తున్న చిన్నారులు

- తొలిరోజే నిమజ్జనాలు
- ఉత్సాహంగా పాల్గొన్న చిన్నారులు, యువత
- పందిళ్లలో ఎమ్మెల్యే కొండయ్య పూజలు



అద్దంకిలోని పోలీస్‌స్టేషన్ రోడ్డులో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం, పంగులూరులో పూజలందుకుంటున్న బొజ్జగణపయ్య, పర్చూరులో కొలువుదీరిన లంబోధరుడు, చినగంజాంలో గంగమ్మ ఒడిలోకి చేరుతున్న గణపతి

అద్దంకి, సెప్టెంబరు 8 : ఒక వైపు వర్షపు జల్లులు పడుతున్నా భక్తులు ఉత్సాహంగా వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసి పూజలు చేస్తున్నారు. అద్దంకి పట్టణం, మండల పరిధిలో సుమారు 100 వరకు విగ్రహాలను ఏర్పాటు చేశారు. వానను దృష్టిలో పెట్టుకొని కొందరు వాటర్ ప్రూఫ్ టెంట్‌లను వేసి జాగ్రత్తలు తీసుకున్నారు. ఆదివారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మండపాల వద్ద ప్రత్యేక అలంకరణలు చేశారు. పలు చోట్ల సాంస్కృతిక కార్య క్రమాలను ఏర్పాటు చేశారు. సోమవారం నుంచి వినాయక నిమజ్జన కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ ఏడాది గుండ్లకమ్మ నదితో పాటు, అద్దంకి బ్రాంచి కెనాల్, భవనాసి చెరువు, ఇతర చెరువులలో నీరు పుష్కలంగా ఉండడంతో నిమజ్జనోత్సవాలు ఎక్కడికక్కడే జరిగే అవకాశం ఉంది. రెండు దశాబ్దాలుగా నాగులపాడులో రెండు విగ్రహాలను ఏర్పాటు చేయటం, నిమజ్జనోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తారు. నాగులపాడు వినాయక విగ్రహాలు పట్టణంలో గుండా నిమజ్జనోత్సవాలకు కదిలే సమయంలో పెద్ద ఎత్తున భక్తులు వచ్చి తిలకిస్తారు. సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేస్తుంటారు.

చీరాల : నియోజకవర్గ పరిధిలో పలుచోట్ల ఆదివారం వివనాయక పందిళ్లలో ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పాల్గొని పూజలు చేశారు. పట్టణంలోని పాపరాజుతోట, వాడరేవులలో ఏర్పాటు చేసిన వినాయ మండపాలను ఆయన సందర్శించారు. పాపరాజుతోటలో పూజా కార్యక్రమాల అనంతరం తిరుపతి, తిరుమల దేవస్థానం నుంచి వచ్చిన వేదపండితులు ఎమ్మెల్యే కొండయ్య ఆశీర్వదించారు. నిర్వాహకులు సన్మానించారు. వేటపాలెం మండలం రామాపురంలో ఏర్పాటు చేసిన వినాయక ప్రత్యేక పూజల్లో కొండయ్య పాల్గొన్నారు. ఎమ్మెల్యేకు స్వాగతం పలికే క్రమంలో యువకులు పేల్చిన బాణసంచా పొరపాటున కొద్ది దూరంలో ఉన్న సమూహంపై పడడంతో పలువురికి గాయాలయ్యాయి.

చీరాలటౌన్ : వినాయకచవితి సందర్భంగా భక్తులు విశేషంగా పూజలు నిర్వహించారు. ఒకవైపు వాతావరణం ప్రతికూలంగా ఉండి నానుడి వర్షం పడుతున్నా ఉత్సాహంగా గడిపారు. మహాత్మాగాంధీ క్లాత్ మార్కెట్ ది టెక్స్‌టైల్ మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 25 అడుగుల వెడల్పు, 15 అడుగుల ఎత్తు విగ్రహం అందరినీ ఆకర్షించింది. చీరాల కూరగాయల మార్కెట్ కూడలి వద్ద ఏర్పాటు చేసిన వినాయకుని ప్రతిమలు, పత్రి, పూలు, పండ్లు కొనుగోలుకు ప్రజలు పోటీపడ్డారు. వాటి ధరలు ఆకాశన్నంటాయి.

బల్లికురవ : మండలంలోని అన్ని గ్రామాలలో శనివారం వినాయక చవితి పండగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భారీ నుంచి చిన్ని గణేశుని ప్రతిమలకు భక్తులు పూజలు చేశారు. పందిళ్లలో, ఇళ్లల్లో పూజలు నిర్వహించి కొందరు తొలిరోజే నిమజ్జనాలను పూర్తిచేశారు. చిన్నారులు బొజ్జ వినాయకుని ఉత్సాహంతో నిమజ్జనానికి తరలించారు.

పంగులూరు : ఉత్సాహంగా గణపతి పూజను భక్తులు నిర్వహించారు. శని, ఆదివారాలలో ప్రతేక పూజలు, రాత్రివేళ భజన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. విద్యుత్ దీపాలతో వినాయక మండపాలను అలంకరించారు.

పర్చూరు : వినాయక చవితి పండుగను ప్రజలంతా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. రామాలయం, తూర్పువారి వీధి, టీనగర్, అద్దంకి మాన్యం, లక్ష్మీపురం, మధ్య బజార్, తూర్పువారి వీధి, కొట్ల బజార్, శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంతోపాటు, అద్దంకి నాంచారమ్మ అమ్మవారి ఆలయల సమీపంలో చిన్నారులు సైతం గణనాధుని విగ్రహం ఏర్పాటు చేసి పూజాకార్యక్రమాలు నిర్వహించారు. నూతలపాడు గ్రామంలోని బొడ్డురాయి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం ఆకట్టుకుంది. ఆ ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో చిమట అశోక్, మల్లికార్జున, గ్రంధి గోపికృష్ణ, సురేష్, రాజశేఖర్, రాజేష్ పాల్గొన్నారు. నాగులపాలెం, వీరన్నపాలెం, చెరుకూరు, అడుసుమల్లి, బోడవాడ, అన్నంబొట్లవారిపాలెం, తిమ్మరాజుపాలెం, దేవరపల్లి, ఉప్పుటూరు, పోతుకట్ల తదితర గ్రామాల్లో వినాయక ఉత్సవాలు అత్యంత వేడుకగా జరిగాయి.

మార్టూరు : వినాయక చవితిని మార్టూరు, యద్దనపూడి మండలాల్లో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. నేతాజీనగర్‌లో యువకులు ఆటపాటలతో స్వామి వారిని ఊరేగింపుగా తీసుకువచ్చి మండపాల్లో అలంకరించారు. పడమర బజారు, తూర్పుబజారున గుంటూరు నుంచి తెచ్చిన భారీ వియాక విగ్రహాలు కొలువుదీరాయి. ఆదివారం పలుచోట్ల వేడుకగా నిమజ్జన కార్యక్రమాలు పూర్తిచేశారు.

చినగంజాం : వినాయకచవితి పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో శని, ఆదివారాలు నిర్వహించారు. పలు ప్రాంతాలలో ఏర్పాటు చేసిన గణనాథుల విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మండపాలను రంగు రంగుల విద్యుత్ దీపాల అలంకరించారు. పెదగంజాం, సంతరావూరు, గొనసపూడి, చింతగుంపల్లి, కడవకుదురు, పెదగంజాం, మోటుపల్లి, చినగంజాం, సోపిరాల, మున్నంవారిపాలెం, రాజుబంగారుపాలెం, కొత్తపాలెం, మూలగానివారిపాలెం, నీలాయపాలెం తదితర గ్రామాల్లో విగ్రహాలను ఏర్పాటు చేశారు. జై... జై గణేశా అంటూ ఊరు వాడా మార్మోగింది. పలు గ్రామాల్లోని విగ్రహాలను వేడుకగా ఆదివారం నిమజ్జన కార్యక్రమాలను నిర్వహించారు.